
ప్రభుత్వ స్థలం ఆక్రమించి నిర్మించిన భారీ భవంతి

కళ్లెదుటే కబ్జా

కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూములను రెవెన్యూ అధికారులు సంరక్షించడంలేదు. రికార్డుల్లో పక్కాగా ప్రభుత్వ భూమిగా ఉన్నా వాటిని స్వాధీనం చేసుకుని ప్రభుత్వ అవసరాలకు వినియోగించుకోవడం లేదు. దీంతో ఏడబ్ల్యూ ల్యాండ్, రోడ్డు పోరంబోకు స్థలాలు సైతం కళ్లెదుటే అన్యాక్రాంతం అవుతున్నాయి. ప్రొద్దుటూరు పట్టణం బొల్లవరంలోని జమ్మలమడుగు ప్రధాన రహదారి పక్కన ఉండే ప్రభుత్వ రోడ్డు పోరంబోకు భూమిని కాపాడుకోవడంలో రెవెన్యూ, మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. కోట్ల విలువైన స్థలాలు అన్యాక్రాంతం అయ్యాయని, వాటిని ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని గతేడాది జనవరి 3వ తేదీన ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. కానీ వైసీపీ ప్రభుత్వంలో అధికారులు చర్యలు తీసుకోలేదు. కూటమి ప్రభుత్వంలోనైనా వీటిని అధికారులు స్వాధీనం చేసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.


ఖాళీగా ఉన్న ప్రభుత్వ స్థలానికి కాంపౌండ్ వాల్ నిర్మించి ఆక్రమించిన దృశ్యం

- రూ.10 కోట్ల ప్రభుత్వ స్థలం అన్యాక్రాంతం
- 50 సెంట్లకు పైగా ఏడబ్ల్యూ ల్యాండ్..
- 1.26 ఎకరాల రోడ్డు పోరంబోకు ఆక్రమణ
- ఏడాది గడిచినా చర్యలు తీసుకోని అధికారులు

ప్రొద్దుటూరు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు మున్సిపాలిటీ పరిధిలోని 1వవార్డు బొల్లవరం సర్వేనెంబరు 506లో 84 సెంట్ల ఏడబ్ల్యూ ల్యాండ్ ఉంది. దీనికి ఆనుకునే 569-బీ లో 1.26 ఎకరాల రస్తా పోరంబోకు ఉంది. ఈ భూములను రెవెన్యూ, మున్సిపల్ అధికారులు సంరంక్షించక పోవడంతో 84 సెంట్ల ఏడబ్ల్యూ ల్యాండులో 50 సెంట్లకు పైగా ఆక్రమించి కొందరు ఆవాసాలు ఏర్పరచుకున్నారు. మిగిలిన 30 సెంట్ల మేర ఖాళీస్థలం ఉంటే స్థానికంగా ఓ నేత ఆ దానిని ఆక్రమించి ప్రహరీ కట్టి అందులో చెట్లు నాటి సొంత పార్కులా వినియోగించుకుంటున్నారు. దీనికి అనుకుని ఉన్న 569-బీలో 1.26 ఎకరాల రస్తా పోరంబోకు స్థలంలో దాదాపు 26 సెంట్ల మేర ఆక్రమణకు గురైంది. ఇందులో కట్టడాలు సైతం వెలిశాయి. మరికొందరు అనధికారికంగా శ్మశానానికి వినియోగిస్తున్నారు. దానికి ప్రహరీ సైతం కట్టారు. ఇది జమ్మలమడుగు రోడ్డు మీదకు ఉంది. ఇందులో రోడ్డు పోరంబోకు సహా ప్రభుత్వ భూమి ఉంది. మిగిలిన ఎకరా భూమి పోరంబోకు ఉన్నట్లు రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. కానీ అది కూడా మున్సిపల్ లే అవుట్‌లో కలిసినట్లు చెబుతున్నారు. మున్సిపల్ లేఅవుట్‌లో ఉందని చెబుతున్న ఎకరా భూమికి సైతం ఎటువంటి రక్షణ చర్యలు తీసుకోలేదు. ఇక్కడ సెంటు స్థలం రూ.10 లక్షల నుంచి రూ.15 లక్షలకు పైగా విలువ చేస్తుంది. ఈ లెక్కన ఆక్రమణకు గురైన దాదాపు 76 సెంట్ల మేర స్థలం మార్కెట్ విలువ రూ.10 కోట్లు ఉంటుంది. ఇంత విలువైన ప్రభుత్వ స్థలాన్ని రెవెన్యూ అధికారులు ఇకనైనా స్పందించి సర్వేచేసి ఆక్రమణలపై చర్యలు తీసుకుంటారా లేదా వైసీపీ ప్రభుత్వంలో మాదిరే అన్యాక్రాంతంపై చోద్యం చూస్తారా వేచిచూడాల్సి ఉంది.


రోడ్డు స్థలాన్ని ఆక్రమించి అనధికారికంగా శ్మశానం ఏర్పాటు చేసి ప్రహరీ గోడ నిర్మించిన దృశ్యం

ఆర్ఎస్ఆర్‌లో చుక్కల భూమిగా..

రెవెన్యూ రికార్డులైన ఆర్ఎస్ఆర్‌లో చుక్కల భూమిగా ఉందని రెవెన్యూ అధికారులు వెల్లడిస్తున్నారు. వెబ్‌ల్యాండ్‌లో మాత్రం ఏడబ్ల్యూ ల్యాండ్‌గా చూపుతోంది. పాత అడంగల్‌లో దొంతిరెడ్డి వెంకట రెడ్డి అనే పేరు ఒక్కటి మాత్రమే 506 సర్వేనెంబరుకు సంబంధించి చూపుతోందని వీఆర్వో అంకాల్ రెడ్డి చెబుతున్నారు. ఆభూముల్లో కొందరు చాలా కాలంగా ఆక్రమించి కట్టిన నిర్మాణాలు ఉన్నాయి. ఇంకా 30 సెంట్ల మేర ఖాళీస్థలం సైతం ఉంది. ఆ భూమిని పట్టా భూమిగా రెగ్యులర్ చేయడానికి దొంతిరెడ్డి వెంకటరెడ్డికి సంబంధించిన వ్యక్తులు లేరు. వారు వచ్చినా తగిన రికార్డులు లేవు. వారి పేరుతో రెగ్యులర్ చేయడానికి వీలులేని పరిస్థితి. ఈ 84 సెంట్ల ప్రభుత్వ భూమి, 1.26 ఎకరాల రస్తా పోరంబోకు భూమిని సమగ్ర సర్వేచేసి ఎంతమేరకు ఆక్రమణలున్నాయి.. వారికి ఏమైనా రికార్డు ఉందా, నిర్మాణాలు చేపట్టిన ఇళ్లకు డాక్యుమెంట్లు లేకుండా ఎలా పన్ను విధించారు.. అనే విషయాలు విచారించడానికి కూడా అధికారులు చొరవ చూపడంలేదు. ఇందుకు కారణం ఆక్రమణదారులు చేస్తున్న రాజకీయపైరవీలు, వారిచ్చే పచ్చనోట్ల కారణంగా అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

తహశీల్దారు ఏమన్నారంటే..

ప్రభుత్వ భూముల ఆక్రమణలపై ప్రొద్దుటూరు తహశీల్దారు గంగయ్యను ఆంధ్రజ్యోతి వివరణ కోరగా వైసీపీ ప్రభుత్వంలో ఏం జరిగిందో తమకు తెలియదని, ఇప్పుడు తమ దృష్టికి వచ్చింది కాబట్టి సాధ్యమైనంత త్వరలో ఆ భూములను సర్వే చేయిస్తామన్నారు. చుక్కల భూమిలో ఎవరైనా ఉండి వారికి సరైన రెవెన్యూ రికార్డులు, రిజిస్ట్రేషన్లు ఉన్న వారు తమదని దరఖాస్తు చేసుకుంటే దానిని పరిశీలించి వారికి పట్టా ల్యాండుగా కన్వర్షన్ చేస్తామన్నారు. కానీ 506 సర్వేనెంబరుకు ఎవరూ లేనప్పుడు అది ప్రభుత్వ భూమిగానే పరిగణిస్తామన్నారు.. రస్తా పోరంబోకు ఆక్రమణలు సైతం గుర్తించి వాటిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని, ప్రభుత్వ భూములను పరిరక్షిస్తామని అన్నారు.

ఎంపీడీవోపై దాడికేసులో నిందితులకు బెయిల్ మంజూరు

కడప రూరల్, జనవరి 2(ఆంధ్రజ్యోతి): గాలివీడు ఎంపీడీవో జవహర్‌బాబుపై జరిగిన దాడి కేసులో వైసీపీ నేతలు ఏ-1 జల్లా సుదర్శన్ రెడ్డితో పాటు ఏ-5 నల్లబత్తిన వెంకటరెడ్డి, ఏ-13 కుడుముల బయ్యారెడ్డిలకు గురువారం నాల్గవ అదనపు జిల్లా కోర్టు(ఎస్సీ,ఎస్టీ కోర్టు) న్యాయమూర్తి జి.దీనబాబు బెయిల్ మంజూరు చేశారు. ఎంపీడీవోపై దాడి ఘటనలో జైలులో రిమాండ్ ఖైదీలుగా ఉన్న వీరు ముగ్గురూ ఎస్సీ, ఎస్టీ కోర్టులో దాఖలు చేసిన బెయిల్ పిటిషన్లపై గురువారం వాదనలు జరిగాయి. పిటీషనర్ల తరుపు న్యాయవాది వాదనలు వినిపించారు. పిటిషనర్ ఏ-1 ఏపీ ప్రాసిక్యూషన్ డైరెక్టర్‌గా, న్యాయవాదిగా పనిచేశారన్నారు. గౌరవప్రదమైన వ్యక్తి అని అతనితో పాటు ఏ-5, ఏ-13 నిందితులకు కూడా బెయిల్ మంజూరు చేయాలని కోర్టును అభ్యర్థించారు. అయితే స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ బెయిల్ దరఖాస్తును వ్యతిరేకిస్తూ కౌంటర్ దాఖలు చేశారు. గాలివీడు ఎంపీడీవో కార్యాలయంలో విధుల్లో ఉన్న ప్రభుత్వ ఉద్యోగిపై దాడిచేయడం దారుణమైన కేసు అని కోర్టుకు విన్నవించారు. ఏపీ ప్రాసిక్యూషన్ డైరెక్టర్‌గా పనిచేసిన నిందుతుడు జల్లా సుదర్శన్‌రెడ్డి అతని అనుచరులు ఎంపీడీవోను కులం పేరుతో అసభ్య పదజాలంతో దుర్భాషలాడడమే కాకుండా పరిణామాలు తీవ్రంగా ఉంటాయని బెదిరించారన్నారు. నిందితులకు బలమైన రాజకీయ నేపథ్యం ఉన్నందువలన వారు సాక్షులను తారుమారు చేస్తారన్నారు. కాబట్టి బెయిల్ కొట్టివేయాలని కోర్టును కోరారు. ఇరు పక్షాల వాదనలను విన్న జడ్జి దీనబాబు పిటిషనర్లు ముగ్గురూ బెయిల్‌కు అర్హులని తెలుస్తోందన్నారు. దర్యాప్తునకు సహకరించాలని ఆదేశిస్తూ, రూ.20వేల వ్యక్తిగత బాండును సమర్పించాలంటూ బెయిల్‌కు ఆదేశాలు జారీ చేశారు.

ఎట్టకేలకు టీడీపీ జిల్లా కార్యాలయానికి మోక్షం

(కడప-ఆంధ్రజ్యోతి): కడపలో టీడీపీ జిల్లా కార్యాలయం నిర్మాణానికి ఎట్టకేలకు మోక్షం లభించింది. 1983లో టీడీపీ ఆవిర్భవించింది. అయితే ఇంతవరకు కడపలో టీడీపీకి సొంత కార్యాలయం లేదు. జిల్లా పార్టీ కార్యాలయం లేని దౌర్భాగ్యస్థితిలో ఆ పార్టీ ఉంది. 2014-19లో టీడీపీ హయాంలో కొందరు టీడీపీ నేతలు అధికారం అడ్డుపెట్టుకుని అడ్డగోలుగా ఎంజాయ్ చేశారు. అప్పట్లో తమకు గుర్తింపు ఇచ్చిన పార్టీకి సొంత కార్యాలయం కట్టించాలన్న ఆలోచన రాలేదు. చివరికి 2019కి ముందు చంద్రబాబు సర్కారు కడపలోని అక్కాయపల్లె రెవెన్యూ పొలం సర్వే నెంబరు 37/4లో రెండు ఎకరాల భూమిని కేటాయించింది. అయితే టీడీపీ నేతలు నిర్మాణం చేపట్టలేదు. 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత టీడీపీ కార్యాలయానికి ప్రభుత్వం ఇచ్చిన లీజును 2020 జనవరి 29న ఉపసంహరించుకున్నట్లు జీవో జారీ చేసింది. ఆరునెలల క్రితం వైసీపీ అధికారం కోల్పోయి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. దీంతో టీడీపీ కార్యాలయ నిర్మాణం కోసం గతంలో జగన్ సర్కారు రద్దు చేసిన జీవోను రద్దు చేస్తూ తాజాగా రాష్ట్ర క్యాబినెట్‌లో మళ్లీ తీర్మానించారు. దీంతో అక్కాయపల్లెలో టీడీపీ జిల్లా కార్యాలయం ఏర్పాటు కానుంది. ఇక దేశంలోనే తొలిసారిగా సోలార్ విండ్ బ్యాటరీ స్టోరేజీ ఇంటిగ్రేటెడ్ ప్రాజెక్టు జిల్లాలో ఏర్పాటు కానుంది. ఇందులో భాగంగా మన జిల్లాలో 119 ఎండబ్ల్యూ పవన మరియు 130 ఎండబ్ల్యూ సోలార్ హైగ్రిడ్ ఇంధనంతో పాటు బ్యాటరీ ఇంధన స్టోరేజీకి ఇంటిగ్రేటెడ్ ప్రాజెక్టు మంజూరుకు మంత్రివర్గం ఆమోదించింది.

నేడు ఏకసభ్య కమిషన్ జిల్లాకు రాక

కడప నాగరాజుపేట, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): షెడ్యూల్ కులాల్లోని ఉప వర్గీకరణపై విచారణ చేయడానికి ప్రభుత్వం నియమించిన రాజీవ్‌రంజన్ మిశ్రా నేతృత్వంలో ఏకసభ్య కమిషన్ శుక్రవారం జిల్లాకు రానుందని డీఆర్వో విశ్వేశ్వరనాయుడు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం కర్నూలు నుంచి రోడ్డు మార్గం ద్వారా ఉదయం 10.30కు జిల్లాకు చేరుకుంటారు. 11 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు జిల్లా యంత్రాంగంతో సమావేశం నిర్వహించడంతో పాటు కలెక్టరేట్ ప్రాంగణంలో ఉన్న సభా భవనంలో వివిధ ఉపకుల సభ్యులు, సంఘాల నుంచి వినతులు స్వీకరిస్తారు. మధ్యాహ్నం 3.30కు రోడ్డు మార్గం ద్వారా నెల్లూరుకు బయలుదేరి వెళతారు.

కువైత్‌లో వేంపల్లె వాసి మృతి 7లో..

ఏపీఎస్పీడీసీఎల్ అక్రమాలపై విచారణ జరపండి

- ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి

పులివెందుల టౌన్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ఏపీఎస్పీడీసీఎల్ అక్రమాలపై విచారణ జరపాలని ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాశారు. ఫైర్డ్ ఎడ్జ్ క్లామ్ కొనుగోలులో అవినీతి అక్రమాలు జరిగాయని ప్రజాధనం దుర్వినియోగం జరిగిందని పేర్కొన్నారు. అధికారులు, కాంట్రాక్టర్లు కుమ్మక్కై కోట్ల రూపాయలను స్వాహా చేస్తున్నారని ఆరోపించారు. వాటిని ఏర్పాటు చేయాల్సిన అవసరం లేకున్నా ఏర్పాటు చేస్తున్నారన్నారు.

ఈ విషయంపై విచారణ చేసి సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలని ఆ లేఖలో ప్రభుత్వాన్ని కోరారు.

నిరుద్యోగ భృతి ఎప్పుడిస్తారు..? : తులసిరెడ్డి

వేంపల్లె, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి గారూ ఎన్నికల హామీలో భాగంగా ఇచ్చిన హామీలలో ఒకటైన నిరుద్యోగ భృతి ఎప్పుడిస్తారని ఏపీసీసీ ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి ప్రశ్నించారు. గురువారం తులసిరెడ్డి వేంపల్లెలో మీడియాతో మాట్లాడుతూ గత ఎన్నికల సందర్భంగా యువతకు సబంధించి 20లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని, నెలకు రూ.3వేల నిరుద్యోగ భృతి ఇస్తామని, మెగా డీఎస్సీ నిర్వహిస్తామని హామీ ఇచ్చారన్నారు. హామీలను నమ్మిన యువత మూకుమ్మడిగా టీడీపీ కూటమికి ఓట్లు వేశారన్నారు. కూటమి అధికారంలోకి వచ్చింది కానీ హామీలను విస్మరించిందని ఆరోపించారు. 20లక్షల ఉద్యోగాలు కాదుకదా 20వేల ఉద్యోగాలు కూడా ఇవ్వలేదన్నారు. నిరుద్యోగ భృతికింద నెలకు రూ.3వేలు కాదుకదా మూడు పైసలు కూడా ఇవ్వలేదన్నారు. ఏడాదికి రూ.7200కోట్లు కావాలి, బడ్జెట్‌లో పైసా కూడా కేటాయించలేదన్నారు. వెంటనే నిరుద్యోగ భృతిని ఈ జనవరి నెల నుంచి అయినా అమలు చేయాలని, మెగా డీఎస్సీకి వెంటనే షెడ్యూల్ ప్రకటించి 16,347 ఉపాధ్యాయ ఖాళీలు భర్తీ చేయాలని తులసిరెడ్డి డిమాండ్ చేశారు.

30 శాతం ఐఆర్ ప్రకటించాలి: ఆపస

అమరావతి, జనవరి 2(ఆంధ్రజ్యోతి): క్యాబినెట్ సమావేశంలో ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆర్థిక బకాయిల అంశాలను ప్రస్తావించకపోవడం బాధాకరమని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం(ఆపస్) అధ్యక్షుడు ఎస్.బాలాజీ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడు నెలలైనా.. ఇంతవరకు రూ.25 వేల కోట్ల బకాయిలు, ఐఆర్, డీఏ, 12వ పీఆర్ అంశాలపై సానుకూల ప్రకటనలు లేవన్నారు. ప్రతి నెలా రెండుసార్లు క్యాబినెట్ సమావేశాలు జరుగుతున్నా.. ఉద్యోగుల అంశాలపై చర్చ జరగట్లేదన్నారు. సంక్రాంతి కానుకగా 30శాతం ఐఆర్ ప్రకటించాలని డిమాండ్ చేశారు.

జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజనం రేపటికి వాయిదా

కలికిరి, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): జూనియర్ కళాశాలల్లోని ఇంటర్మీడియట్ విద్యార్థుల కోసం శుక్రవారం నుంచి ప్రారంభం కావలసిన మధ్యాహ్న భోజన పథకం శనివారానికి వాయిదా పడింది. ఈనెల 4వ తేదీ ఈ పథకాన్ని అన్ని జూనియర్ కళాశాలల్లో ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని డైరెక్టర్ ఆఫ్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ కళాశాలల ప్రిన్సిపాళ్లను గురువారం ఆదేశించారు. శనివారం నుంచి అమల్లోకి తెచ్చేందుకు ఆయా కళాశాలల ప్రిన్సిపాళ్లు సన్నాహాలు చేసుకుంటున్నారు. జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజనం పథకం అమలు కోసం అనుమతులు జారీ చేస్తూ మంగళవారం ప్రభుత్వం జీవో నెం.40 జారీ చేసింది. పథకం అమలు విధివిధానాలను కూడా ప్రభుత్వం అందులో వివరించింది. ఆ మరుసటి రోజు అంటే బుధవారం నుంచి ప్రారంభించాలని అందులో ఆదేశించారు. ఇందుకనువుగా ఈ విద్యా సంవత్సరానికి అవసరమైన బడ్జెట్ రూ.27.39 కోట్లు కూడా మంజూరు చేసింది. అయితే మాజీ ప్రధానమంత్రి మన్మోహన్‌సింగ్ మృతి కారణంగా సంతాప దినాలు అమలులో ఉండటంతో 3వ తేదీ అమలు చేసేందుకు ప్రయత్నించారు. వివిధ కారణాల రీత్యా ఇది శనివారానికి వాయిదా పడింది. పాఠశాలల విద్యార్థులకు అందజేస్తున్న మెనూ ప్రకారమే ఇంటర్మీడియట్ విద్యార్థులకు కూడా మధ్యాహ్న భోజనం అందజేయాలని ప్రభుత్వం సూచించింది. కాగా జిల్లాలోని కొన్ని మండలాల్లో ఇస్కాన్ ద్వారా కేంద్రీకృత వంటశాలల్లో తయారు చేసిన పదార్థాలను ఆయా పాఠశాలలకు సరఫరా చేస్తున్నారు. ఇక మిగిలిన ఇతరత్రా మండలాల్లో స్థానిక పాఠశాలల్లో వంట మనుషులను ఏర్పాటు చేసుకుని తయారు చేస్తున్నారు. ఇస్కాన్ సరఫరా చేస్తున్న మండలాల్లోని జూనియర్ కళాశాలలకు కూడా యథాతథంగా అదే భోజనాన్ని అందజేయనున్నారు.

అబలలకు 'ఉల్లాస్'



- నిరక్షరాస్యులైన మహిళలకు రాత్రి బడులు 6
- ఆర్థిక, సామాజిక, డిజిటల్ విధానంపై బోధన
- జిల్లాలో 23,470 మంది ఎంపిక

ప్రజల ఆరోగ్యానికి పెద్దపీట

- మహిళా సాధికారతతో పేదరిక నిర్మూలన
- కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్
- సీకేదిన్నె, జమ్మలమడుగు మండలాల్లో పర్యటన
- క్షేత్రస్థాయిలో మహిళలు, రైతులతో ముఖాముఖి

కడప కలెక్టరేట్/సీకేదిన్నె, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రజల ఆరోగ్యానికి పెద్దపీట వేస్తోందని కేంద్ర శాస్త్ర, సాంకేతిక భౌగోళిక శాస్త్ర శాఖ మంత్రి డాక్టర్ జితేంద్రసింగ్ తెలిపారు. ప్రభుత్వ పథకాలన్నీ ప్రజల అభివృద్ధికి ఉపయోగపడాలని అన్నారు. జిల్లా పర్యటన కోసం బుధవారం రాత్రి ఆయన కడపకు చేరుకున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో గురువారం ఉదయం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో కలెక్టర్ డాక్టర్ చెరుకూరి శ్రీధర్ అధ్యక్షతన ఆకాంక్షల జిల్లా, బ్లాకుల అభివృద్ధిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయం వాటి అనుబంధ శాఖలు, పరిశ్రమలు, విజన్ యాక్షన్ ప్లాన్ 2024-29 తదితర అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కలెక్టర్ వివరించారు. పీఎం మాతృవందన యోజన్ పోష్ అభియాన్, పీఎం కిసాన్ సమ్మాన్ నిధి, పీఎం అవాస్ యోజన్, జల్ జీవన్ మిషన్, హర్ ఘర్ జల్ యోజన్, స్వచ్ఛ భారత్ మిషన్, పీఎం ఉజ్వల యోజన, పీఎం కౌశల్ వికాస్ యోజన, గరీబ్ కళ్యాణ్ యోజన తదితర అంశాలపై కేంద్ర మంత్రికి కలెక్టర్ వివరించారు. అనంతరం మంత్రి లేవనెత్తిన సందేహాలను కలెక్టర్ నివృత్తి చేశారు.

ఆయుష్మాన్ భారత్‌లో ఉచిత వైద్యసేవలు

అనంతరం మంత్రి జితేంద్రసింగ్ చింతకొమ్మదిన్నె మండలం బుగ్గలపల్లె పంచాయతీలో ఆయుష్మాన్ ఆరోగ్యకేంద్రం, అంగన్వాడీ కేంద్రం, ఉద్యానపంటలు, ప్రకృతి వ్యవసాయం, జీవామృతం తయారీ, పంటల సాగును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం ప్రజల ఆరోగ్యానికి పెద్దపీట వేస్తోందన్నారు. ఇందులో భాగంగా ఆయుష్మాన్ భారత్‌లో వైద్యసేవలను ఉచితంగా అందిస్తోందన్నారు. రూ.5 లక్షల వరకు ఉచితంగా వైద్యం చేయించుకోవడానికి ప్రధానమంత్రి నిరుపేద కుటుంబాలకు ఆయుష్మాన్ కార్డులను అందజేశారన్నారు. ఆరోగ్యంపై, పౌష్టికాహారంపై కేంద్రం ప్రత్యేక చొరవ చూపి గర్భవతులకు, బాలింతలకు, చిన్నపిల్లలకు అంగన్వాడీ కేంద్ర ద్వారా పౌష్టికాహారం అందిస్తుందన్నారు. ఈ సందర్భంగా బుగ్గలపల్లి అంగన్వాడీ కేంద్రంలో పిల్లలకు ఆయన పౌష్టికాహారాన్ని తినిపించారు. అనంతరం అరటి, చామంతి, వంగ, సొరకాయ, ముల్లంగి పంటలను పరిశీలించారు. అనంతరం నమో డ్రోన్ దీదీ పథకం అమలుతీరును పరిశీలించి లబ్ధిదారులతో స్వయంగా మాట్లాడి ప్రకృతి వ్యవసాయం గురించి అడిగి తెలుసుకున్నారు. ఆయా కార్యక్రమాల్లో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలించారు.

జిల్లా యంత్రాంగం కృషి భేష్

సీకేదిన్నె మండలంలో పర్యటన ముగిసిన అనంతరం మంత్రి ఎర్రగుంట్ల మీదుగా జమ్మలమడుగు చేరుకున్నారు. ఇక్కడి మోరగుడి గ్రామంలోని ఎస్ఆర్‌ఫంక్షన్ హాలులో కలెక్టర్ అధ్యక్షతన ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశానికి మంత్రి హాజరయ్యారు. ముందుగా ఫంక్షన్ హాలులో ఏర్పాటుచేసిన ఆహార పదార్థాలు, హ్యాండ్‌లూమ్‌కు సంబందించిన ప్రాజెక్టులు పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ దేశంలో పేదరిక నిర్మూలన మహిళా అభివృద్ధి, సాధికారిత, పొదుపు సంఘాల బలోపేతంతోనే సాధ్యం అవుతుందన్నారు. మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసే దిశగా ఎన్నో రకాల సంక్షేమ పథకాలను కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. ప్రతి ఒక్కరు ఏదో ఒక రంగంలో స్వయం ఉపాధిని పొందుతున్నారంటే జిల్లా యంత్రాంగం ఎంతో కృషి చేస్తోందని అందుకు అభినందనలు తెలుపుతున్నామన్నారు. ప్రతి మండలం నుంచి చురుగ్గా ఉన్న స్వయం సహాయక గ్రూపులను గుర్తించి వారిని ఈ-కామర్స్ బిజినెస్‌లోకి అడుగులు వేసేందుకు ప్రోత్సహిస్తున్నామన్నారు. అనంతరం మోరగుడి ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేయనున్న సెంట్రల్ కిచెన్‌కు సంబంధించిన శిలాఫలకాన్ని మంత్రి ఆవిష్కరించారు.

సమగ్రశిక్ష ఉద్యోగులు మంత్రికి వినతి పత్రం అందించి తమ సమస్యలు పరిష్కరించాలని, కాంట్రాక్టు ఉద్యోగులు తమను రెగ్యులర్‌చేయాలని కోరారు. అనంతరం మంత్రి గండికోటకు చేరుకున్నారు. అక్కడ పురాతన ఆలయాలను, సహజసిద్ధంగా ఏర్పడిన పెన్నాలోయను సందర్శించారు. రాత్రికి కడపకు చేరుకుని బస చేశారు. ఈ కార్యక్రమాల్లో ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి, కమలాపురం ఎమ్మెల్యే కృష్ణచైతన్యరెడ్డి, జడ్పీసీఈవో ఓబుళమ్మ, వ్యవసాయ ఉద్యానవనశాఖ అధికారులు నాగేశ్వరరావు, సుభాషిణి, నాగరాజు, మీనాక్షి, ఆరోగ్యశ్రీ డీసీ బాలాంజనేయులు, ఐసీడీఎస్ పీడీ శ్రీలక్ష్మి, డీఆర్‌డీఏ పీడీ ఆనంద్ నాయక్, డ్వామా పీడీ ఆదిశేషారెడ్డి, కడప ఆర్డీవో జాన్ ఎర్విన్, జమ్మలమడుగు ఆర్డీవో సాయిశ్రీ, మండల అధికారులు, పలువురు కూటమి నేతలు పాల్గొన్నారు.


సీకేదిన్నె మండలం బుగ్గలపల్లెలో ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగుచేసిన వంగపంటను పరిశీలిస్తున్న కేంద్రమంత్రి జితేంద్రసింగ్, చిత్రంలో కలెక్టర్ డాక్టర్ చెరుకూరి శ్రీధర్, ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి తదితరులు



జమ్మలమడుగు మండలం మోరగుడి ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేయనున్న సెంట్రల్ కిచెన్‌కు సంబంధించిన శిలాఫలకం ఆవిష్కరిస్తున్న మంత్రి జితేంద్రసింగ్, చిత్రంలో కలెక్టర్, ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి

నేడు జిల్లాస్థాయి సైన్స్‌ఫెయిర్

- 36 మండలాల నుంచి రానున్న ప్రాజెక్టులు
- కడప ఉప విద్యాధికారి జి.రాజగోపాల్‌రెడ్డి 7

డబ్బు కోసం మానాన్నను మనవడే చంపాడు

- నెల తరువాత కొడుకు ఫిర్యాదు
- విచారణ చేపడుతున్న పోలీసులు 7

అబలలకు 'ఉల్లాస్'



- నిరక్షరాస్యులైన మహిళలకు రాత్రి బడులు
- ఆర్థిక, సామాజిక, డిజిటల్ విధానంపై బోధన
- జిల్లాలో 23,470 మంది ఎంపిక

కడప ఎడ్యుకేషన్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం విద్యారంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తోంది. నిరక్షరాస్యులైన మహిళల్లో అక్షర వెలుగులు నింపేందుకు చర్యలు చేపట్టింది. ప్రస్తుత రోజుల్లో పల్లె, పట్టణం తేడా లేకుండా ఎక్కడ చూసిన డిజిటల్, సాంకేతికత, నగదు రహిత లావాదేవీలు కొనసాగుతున్నాయి. పొదుపు సంఘాల్లో మహిళలకు ఇవన్నీ నేర్చుకోవడం ఎంతో అవసరం. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఉల్లాస్ (అండర్‌స్టాండింగ్ ఆఫ్ లైఫ్‌లాంగ్ లెర్నింగ్ ఫర్ ఆల్ ఇన్ సొసైటీ) అనే కార్యక్రమం తీసుకొస్తోంది. ఇందులో భాగంగా ఆర్థిక సామాజిక డిజిటల్ అక్షరాస్యతపై మహిళలకు తరగతులు నిర్వహిస్తోంది. బ్యాంకు ఖాతాలున్న వారికి వాటి నిర్వహణపై అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమ ఉద్దేశం. జిల్లాలో డ్వాక్రా మహిళలతో పాటు ప్రభుత్వ పాఠశాలల్లో ఆయాలు, వంట పని చేసే వారికి ఈ పథకం అమలు చేయనున్నారు.

ఉల్లాస్ కార్యక్రమాన్ని న్యూ ఇండియా లిటరసీ ప్రోగ్రాం (ఎన్ఐఎల్‌పీ) అని కూడా అంటారు. ఇది జాతీయ విద్యా విధానం (ఎన్ఈపీ) 2020కి అనుగుణంగా ఉండే కేంద్ర ప్రాయోజిత కార్యక్రమం. 15 ఏళ్లు అంతకంటే ఎక్కువ వయసు ఉన్న పెద్దలకు సాధికారత కల్పించడం, పాఠశాల విద్య అందించడం దీని లక్ష్యం. చదవడం, రాయడం, సంఖ్యా నైపుణ్యాలతో సహా క్రియాత్మక అక్షరాస్యతను అందించడంపై దృష్టి పెడుతుంది. జీవితకాల అభ్యాసాన్ని పెంపొందించడం ద్వారా అభ్యాసకులను క్లిష్టమైన జీవిత నైపుణ్యాలతో సుసంపన్నం చేస్తుంది. ముఖ్యంగా ఆర్థిక అక్షరాస్యత, డిజిటల్ అక్షరాస్యత, లీగల్ అక్షరాస్యత, క్రియాత్మక అక్షరాస్యత గురించి విద్యను 15 ఏళ్లు అంతకంటే ఎక్కువ వయసు ఉన్న పెద్దలకు అందిస్తారు. రాష్ట్రంలోని మొత్తం 26 జిల్లాల్లో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో అమలు చేయనున్నారు. ఎస్‌హెచ్‌సీ లబ్ధిదారులు అన్ని ప్రభుత్వ ఎంపీపీఎస్, జడ్పీహెచ్ఎస్, ఎయిడెడ్ పాఠశాలల్లోని ఆయాలు, వంటవారు, సహాయకులు, నైట్ వాచ్‌మెన్లు, అంగన్వాడీ హెల్పర్లు ఈ ప్రోగ్రాంలో అభ్యాసకులు. మన రాష్ట్రంలో ఈ ప్రోగ్రాం కాలవ్యవధి మూడు సంవత్సరాలు. ఈ కార్యక్రమానికి చైర్మన్‌గా కలెక్టర్ వ్యవహరిస్తారు. వయోజన విద్య ఉప సంచాలకులు, మెంబర్, కన్వీనర్, సభ్యులుగా ప్రాజెక్టు డైరెక్టర్, డీఆర్‌డీఏ, ఐసీడీఎస్ పీడీ, జిల్లా పంచాయతీ అధికారి (డీపీఓ), జిల్లా విద్యాధికారి (డీఈఓ), జిల్లా ప్రజా సంబంధాల అధికారి (డీపీఆర్ఓ), జిల్లా గ్రామ, వార్డు సచివాలయాల నోడల్ అధికారి ఉంటారు. పది మంది అభ్యాసకులకు ఒక వలంటరీ టీచర్ ద్వారా చదువు నేర్పిస్తారు. విద్యావంతులైన విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్లు (వీఓఏ)లు క్లస్టర్ ఎస్‌హెచ్‌జీల రీసోర్స్ పర్సన్లు వలంటీర్ టీచర్లుగా వ్యవహరిస్తారు. ప్రతి వలంటీర్ టీచర్ పది మంది అభ్యాసకులతో మ్యాపింగ్ చేస్తారు. ఈ కార్యక్రమం అంగన్వాడీ కేంద్రంలో సాయంత్రం రెండు గంటలు నిర్వహిస్తారు. మొత్తం ఆరు నెలలకు గాను వంద రోజులు ఈ కార్యక్రమం ఉంటుంది. గ్రామస్థాయిలో కార్యక్రమం సమన్వయాన్ని విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్ (వీఓఏ) పర్యవేక్షిస్తారు. క్లస్టర్ కోఆర్డినేటర్ (సీసీ), ఎస్ఈఆర్‌పీ, వీఓఏ, సీసీ కార్యక్రమం సమన్వయ ప్రయత్నాలకు నాయకత్వం వహిస్తారు. మండల స్థాయిలో ఈ కార్యక్రమాన్ని ఎంపీడీఓ, అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ (ఏపీఎం), సెర్ప్, వయోజన విద్యాశాఖ పర్యవేక్షకులు పర్యవేక్షిస్తారు. డివిజనల్ స్థాయిలో ఈ కార్యక్రమాన్ని అసిస్టెంట్ ప్రాజెక్టు ఆఫీసర్ (ఏపీఓ), వయోజన విద్యా విభాగం సూపర్వైజర్ నిర్వహిస్తారు. కలెక్టర్ అధ్యక్షతన జిల్లా స్థాయి కమిటీ మద్దతుతో వయోజన విద్య శాఖ డిప్యూటీ డైరెక్టర్, అసిస్టెంట్ డైరెక్టర్, పీడీ, డీఆర్‌డీఏ, జిల్లాస్థాయిలో కార్యక్రమాన్ని అమలు చేయడానికి బాధ్యత వహిస్తారు. అక్షరాస్యత తరగతులు పూర్తైన తర్వాత, మార్చిలో జరిగే నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓపెన్ స్కూల్ (ఎన్ఐఓఎస్) ఆంధ్రప్రదేశ్ ఓపెన్ స్కూల్ సొసైటీ (ఏపీఓఎస్ఎస్) ద్వారా అసెస్‌మెంట్ పరీక్ష నిర్వహించుట ద్వారా ఈ కార్యక్రమం పూర్తవుతుంది.

ఎంతో ఉపయోగకరం



ఉల్లాస్ కార్యక్రమం నిరక్షరాస్యులైన మహిళలకు ఎంతో ఉపయోగకరం. వారికి చదవడం, రాయడంతో పాటు డిజిటల్ లావాదేవీలపై కూడా పూర్తి అవగాహన కల్పిస్తారు. అలాగే సమాజం పట్ల అవగాహనతో పాటు ఆరోగ్యం, నైతిక విలువలు లాంటి అనేక అంశాలపై కూడా అవగాహన కల్పిస్తాము. ఇప్పటికే ఉల్లాస్ కార్యక్రమానికి సంబంధించి జిల్లా, మండల స్థాయిలలో పలు కమిటీలను ఏర్పాటు చేశాం. పుస్తకాల ప్రింటింగ్ కూడా పూర్తయింది. మరో వారం రోజులల్లోపు జిల్లాకు పుస్తకాలు రానున్నాయి. వచ్చిన వెంటనే కార్యక్రమాన్ని జిల్లాలో ప్రారంభిస్తాం.

- సుబ్బారెడ్డి, వయోజన విద్య డిప్యూటీ డైరెక్టర్, కడప

జిల్లాలో 23,470 మంది ఎంపిక

డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కార్యక్రమానికి జిల్లాలోని 35 మండలాల్లో 23,470 మందిని ఎంపిక చేశారు. ప్రతి పది మందికి ఒక వలంటీర్ చొప్పున 2347 మందిని ఎంపిక చేశారు. డ్వాక్రా సభ్యులతో పాటు మండల, జిల్లా పరిషత్తు, ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఆయాలు, సహాయకులు, వంట పనివాళ్లు, రాత్రి కాపలాదారులు, అంగన్వాడీ కేంద్రాల్లోని ఆయాలు, నిరక్షరాస్యులను ఎంపిక చేసి మార్చి 15 వరకు తరగతులు బోధిస్తారు. శిక్షణ అనంతరం వీరికి పరీక్షలు నిర్వహిస్తారు.

ఏం చేస్తారంటే...

మూడేళ్ల పాటు కొనసాగే ఈ కార్యక్రమంలో ప్రతి ఆరు నెలలకు ఒక బృందానికి పాఠాలు బోధిస్తారు. ఆరు నెలలు వ్యవధిలో 200 గంటల పాటు ఆర్థిక, సామాజిక, డిజిటల్ అక్షరాస్యతపై మహిళలకు అభ్యసన తరగతులు నిర్వహిస్తారు. ఇందుకు ప్రతి పది మందికి ఒక వలంటీర్‌ను ఎంపిక చేశారు. వీరిలో స్వచ్ఛందంగా బోధనకు వచ్చే నిరుద్యోగులతో పాటు డ్వాక్రా సంఘాల్లో చదువుకున్న మహిళలు, వీఓఏలు ఉన్నారు. వీరు సాయంత్రం 5 నుంచి 7గంటల మధ్య సమయంలో బోధిస్తారు.

మహిళలకు బోధించాల్సింది ఇదే..

కుటుంబం-ఇరుగుపొరుగు, మన ఆచార వ్యవహారాలు, పరిశుభ్రత-ఆరోగ్యం, ఎన్నికలు, పిల్లల పెంపకం-మన బాధ్యత, చట్టాలు తెలుసుకుందాం, మా ఇంటి మహాలక్ష్మి, డిజిటల్ అక్షరాస్యత ఈ అంశాల చుట్టూ తెలుగు భాష, గణిత దైనందిన వినియోగానికి సంబంధించిన నైపుణ్యాలను పెంపొందించే ఉద్దేశంతో పుస్తకాన్ని రూపొందించారు.

మృతదేహంతో ఆస్పత్రి ఎదుట నిరసన



మృతదేహంతో నిరసన తెలుపుతున్న మృతుడి కుటుంబసభ్యులు

తంబళ్లపల్లె, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): అత్యవసర వైద్య చికిత్సల కోసం ప్రభుత్వాసుపత్రికి వస్తే అంబులెన్సులో నుంచి రోగిని ఆసుపత్రిలోకి తరలించడానికి కూడా సిబ్బంది రాకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించారని మృతదేహంతో బంధువులు నిరసన తెలిపారు. ఈ సంఘటన తంబళ్లపల్లె మండల కేంద్రంలో గురువారం జరిగింది. బాధితులు తెలిపిన వివరాల మేరకు... తంబళ్లపల్లె మండలం గోపిదిన్నె పంచాయతీ ఉప్పులూరివాండ్లపల్లెకు చెందిన శ్రీరాములునాయక్ (58) గురువారం శ్వాస తీసుకోవడానికి ఇబ్బంది పడుతుండటంతో 108లో తంబళ్లపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ క్రమంలో రోగిని అంబులెన్సులో నుంచి కిందకు దించి ఆసుపత్రిలోకి తీసుకువెళ్లడానికి ఆసుపత్రి సిబ్బంది ఎవ్వరూ ముందుకు రాలేదు. అయితే, అప్పటికే (మార్గమధ్యలో) ఆయన మృతి చెందడంతో 108లో నుంచి కిందకు దింపి ఆసుపత్రిలోకి తరలించడానికి సిబ్బంది ససేమిరా అని.. మీరే తీసుకువెళ్లండి అని చెప్పారు. శ్రీరాములు నాయక్ ప్రాణంతో ఉన్నాడా, లేదా అని పరీక్షించడానికి సైతం ఎవ్వరూ ముందుకు రాకపోగా ఆసుపత్రి బయట స్ట్రెచర్‌పైనే ఉంచడంతో కుటుంబసభ్యులు వైద్య సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేసి నిరసన తెలిపారు. దీంతో కొంతసేపటి తర్వాత విధుల్లో ఉన్న వైద్యుడు వచ్చి రోగిని పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. అత్యవసర సమయాల్లో ఆసుపత్రికి వచ్చే రోగులను కూడా సిబ్బంది పట్టించుకోలేదని.. ఇంత పెద్ద ఆసుపత్రిలో రోగులకు ఇక వైద్యం ఏమి అందుతుందని మృతుడి అల్లుడు మాజీ సర్పంచ్ రమణానాయక్ ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానికులు, కూటమి నాయకులు ఆసుపత్రి వద్దకు చేరుకుని వైద్యులు, సిబ్బంది పనితీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

యోగాసన పోటీల్లో ద్వితీయ స్థానం

- ఉపాధ్యాయురాలు విజయలక్ష్మి ప్రతిభ

సంబేపల్లె, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): జాతీయ యోగాసన పోటీల్లో ఉపాధ్యాయురాలు విజయలక్ష్మి ఉత్తమ ప్రతిభ కనబరచినట్లు ఎంఈవో శ్రీనివాసులు తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని సంబేపల్లె హైస్కూల్‌లో కాంప్లెక్స్ ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఝార్ఖండ్ ప్రభుత్వం ఆధ్వర్యంలో డిసెంబరు 26 నుంచి 31వ తేదీ వరకు 6 రోజుల పాటు జరిగిన 43వ జాతీయ యోగాసన పోటీల్లో ఉపాధ్యాయురాలు విజయలక్ష్మి పాల్గొని అద్భుత ప్రతిభ కనబరచి ద్వితీయ స్థానాన్ని కైవసం చేసుకున్నట్లు తెలిపారు. ఈమె సంబేపల్లె మండలం గొల్లపల్లి ప్రాథమిక పాఠశాలలో సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సంబేపల్లె ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు మడితాటి నరసింహారెడ్డి, కేజీబీవీ ప్రిన్సిపాల్ పద్మావతి, ఉపాధ్యాయులు ప్రభాకర్‌రెడ్డి, చంద్రశేఖర్, సుభాషిణి, జగదీశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయురాలు విజయలక్ష్మిని సన్మానిస్తున్న దృశ్యం

సేంద్రియ వ్యవసాయానికి ఐటీసీ వెన్నుదన్ను



రైతు శివ వ్యవసాయ క్షేత్రంలో ఐటీసీ ప్రతినిధులు

పీలేరు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): సేంద్రి య, ప్రకృతి వ్యవసాయానికి తమ సంస్థ వెన్నుదన్నుగా నిలుస్తుందని ఐటీసీ సంస్థ దక్షిణ భారత ఎఫ్‌పీవోల అభివృద్ధి మేనేజర్ పురుషోత్తం తెలిపారు. పూర్తిగా ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో మామిడిని సాగు చేస్తున్న కేవీపల్లె మండలం నూతనకాల్వకు చెందిన రైతు శివ వ్యవసాయక్షేత్రాన్ని గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సేంద్రియ ఉత్పత్తులకు మార్కెట్‌లో బాగా డిమాండ్ ఉన్నప్పటికీ తగినంత లభ్యత లేకపోవడంతో చాలా మంది రసాయనిక ఉత్పత్తులనే వాడుతున్నారన్నారు.

వారందరికీ సేంద్రియ ఉత్పత్తులను అందుబాటులోకి తేవాలన్న లక్ష్యంతో తమ సంస్థ సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తోందన్నారు. అందులో భాగంగా మామిడి, బొప్పాయి, అరటి పంటల్లో ఇప్పటికే సేంద్రియ, ప్రకృతి వ్యవసాయ పద్ధతులను పాటిస్తున్న రైతులను గుర్తించి వారి పంటలను కొనేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. అంతేకాకుండా ఆ మూడు పంటలు సాగుచేసే ఆసక్తి ఉన్న రైతులకు తమ సంస్థ ద్వారా సాంకేతిక శిక్షణ ఇవ్వడంతో పాటు కొంతమేర ఇన్‌పుట్ సబ్సిడీ కూడా అందజేస్తామన్నారు. రెండు, మూడేళ్ల మామిడి తోటలు ఉన్న వారు పూర్తిగా సేంద్రియ పద్ధతిలోకి మారేందుకు కావాల్సిన సాంకేతిక శిక్షణ అందిస్తామన్నారు. తమ పర్యవేక్షణలో పండించిన పంటలను తామే కొనుగోలు చేస్తామని, అలా తమకు అమ్మడానికి ఇష్టపడని రైతు లు వారికి కావాల్సిన చోట అమ్ముకోవచ్చునన్నారు. సేంద్రియ, ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటిస్తున్న రైతుల గురించి తాము జరిపిన అన్వేషణలో పీలేరుకు చెందిన ప్రముఖ ప్రకృతి వ్యవసాయ నిపుణుడు బోదేషావలి ద్వారా రైతు శివ గురించి తెలిసి ఆయన వ్యవసాయక్షేత్రాన్ని పరిశీలించామన్నారు. త్వరలోనే శివ వ్యవసాయక్షేత్రాన్ని తమ సాంకేతిక నిపుణుల బృందం పరిశీలిస్తుందని, పీలేరు ప్రాంతంలో తాము ఈ మామిడి సీజన్ నుంచే కార్యకలాపాలు ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. ఆసక్తి గల రైతులు బోదేషావలిని 9703635827 నెంబరులో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఐటీసీ సంస్థ భాగస్వామి అయిన 'బ్రెడ్స్' ఎన్‌జీవో సీనియర్ మేనేజర్ బోజిరాజు, బోదేషావలి పాల్గొన్నారు.

ములకలచెరువులో టెన్షన్.. టెన్షన్...

- మండల సర్వసభ్య సమావేశంతో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు
- ఓవైపు టీడీపీ, మరోవైపు వైసీపీ వర్గీయుల మోహరింపు
- ఇరువర్గాల వారిని నిలువరించిన పోలీసులు
- మండల సమావేశం వాయిదా
- ఎంపీడీవోపై వైసీపీ నేతల దౌర్జన్యం
- మినిట్స్ బుక్ లాక్కుని... ఎంపీడీవోపై నానా దుర్భాషలు
- పోలీసులకు ఫిర్యాదు చేసిన ఎంపీడీవో



మినిట్స్ బుక్‌ను లాక్కున్న వైసీపీ ప్రజాప్రతినిధులను హెచ్చరిస్తున్న ఎస్ఐ నరసింహుడు

ములకలచెరువు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ములకలచెరువు మండల ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశం సందర్భంగా గురువారం తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ప్రజాస్వామ్యబద్ధంగా గెలవని వైసీపీ ప్రజాప్రతినిధులకు సమావేశానికి వచ్చే అర్హత లేదని తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి దాసరిపల్లె జయచంద్రారెడ్డి సూచనలతో టీడీపీ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో ఎంపీడీవో కార్యాలయం వద్దకు చేరుకున్నారు. సెలెక్టెడ్ ఎంపీటీసీలు, సర్పంచులు గో బ్యాక్ అంటూ పెద్దఎత్తున నినాదాలు చేశారు. సమావేశం నిర్వహించేందుకు హైకోర్టు ఉత్తర్వులు ఉన్నాయని సమావేశం నిర్వహించాలని పోలీసులు టీడీపీ శ్రేణులను అడ్డుకున్నారు. అలాగే కార్యాలయం వద్దకు వైసీపీ నాయకులు, కార్యకర్తలు భారీగా చేరుకున్నారు. టీడీపీ శ్రేణులు ఓవైపు....వైసీపీ నాయకులు మరోవైపు ఉండడంతో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా మదనపల్లె డీఎస్పీ కొండయ్యనాయుడు, ములకలచెరువు, బి.కొత్తకోట, మదనపల్లె, పుంగనూరు సీఐలు, ఎస్ఐలు, పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేసి ఇరువర్గాలను అదుపు చేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ప్రచార సమన్వయకర్త సీడు మల్లికార్జుననాయుడు, బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి గుత్తికొండ త్యాగరాజు, జిల్లా కార్యదర్శి యర్రగుడి సురేష్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కేవీ రమణ, టీడీపీ నేతలు విశ్వనాథరెడ్డి, కట్టా సురేంద్రనాయుడు, తులసీధర్‌నాయుడు, తంబళ్లపల్లె, కురబలకోట మండలాల టీడీపీ అధ్యక్షుడు రెడ్డెప్పరెడ్డి, వైజీ సురేంద్రయాదవ్ తదితరులు మాట్లాడుతూ దమ్ముంటే ప్రజాస్వామ్యబద్ధంగా గెలిచి సమావేశాలకు రావాలన్నారు. వైసీపీ ప్రజాప్రతినిధులు పుంగనూరు నుంచి రౌడీలను పిలుచుకొచ్చి ఇక్కడ దౌర్జన్యం చేస్తున్నారన్నారు. ఈ క్రమంలో వైసీపీ ప్రజాప్రతినిధులు 11.05 గంటలకు సమావేశానికి హాజరయ్యేందుకు కార్యాలయంలోకి వెళ్లారు. అయితే ఉదయం 10.30 గంటలకు ప్రారంభం కావాల్సిన సమావేశానికి 11 గంటల వరకు సభ్యులు ఎవరూ హాజరు కాకపోవడంతో కోరం లేక సమావేశాన్ని వాయిదా వేసినట్లు ఎంపీడీవో హరినారాయణ ప్రకటించారు. వాయిదా వేసిన ఐదు నిమిషాలకు కార్యాలయంలోకి వచ్చిన వైసీపీ ప్రజాప్రతినిధులు ఆగ్రహంతో ఎండీడీవోపై చిందులు తొక్కారు. తరువాత ఎంపీడీవో ఛాంబర్‌లోకి వెళ్లి మినిట్స్ బుక్‌ను లాక్కొని నానా దుర్భాషలాడారు. సమావేశం వాయిదా వేసే ముందు తమకు ఫోన్ చేసి చెప్పకుండా ఏం పీకుతున్నావు నీవు అంటూ తిట్టారు. దీంతో అక్కడే ఉన్న ఎస్ఐ నరసింహుడు గవర్నమెంట్ ప్రాపర్టీ అయిన మినిట్స్ బుక్‌ను తీసుకునే అర్హత మీకు లేదని, వెంటనే మినిట్స్ బుక్‌ను ఇవ్వాలని హెచ్చరించడంతో కొంతసేపటికి ఇచ్చారు. టీడీపీ నిరసన కార్యక్రమంలో నాయకులు గంగాదేవి, మూగి రవిచంద్ర, భాస్కర్‌రెడ్డి, యల్లారెడ్డి, సిద్ధవరం ప్రసాద్, కిట్టన్న, నారాయణ, సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసులకు ఫిర్యాదు చేసిన ఎంపీడీవో

ములకలచెరువు మండల ప్రజాపరిషత్ కార్యాలయంలోని తన ఛాంబర్‌లో జరిగిన వైసీపీ ప్రజాప్రతిధుల దౌర్జన్యంపై ఎంపీడీవో హరినారాయణ గురువారం సాయంత్రం పోలీసులకు ఫిర్యాదు చేశారు. మండల ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశంను ఉదయం 10.30 గంటలకు ఏర్పాటు చేశామని, సమావేశంకు అధ్యక్ష, ఉపాధ్యక్షులు, ఎంపీటీసీలు హాజరుకాకపోవడంతో కోరం లేక వాయిదా వేశామని తెలిపారు. తమ కార్యాలయ సిబ్బంది చూస్తుండగా నా వద్ద నుంచి మండల పరిషత్ తీర్మాన పుస్తకాన్ని వైసీపీ జడ్పీటీసీ మోహన్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు లాక్కున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇంతటితో ఆగకుండా నన్ను తిట్టి, భయభ్రాంతులకు గురిచేసి విధులకు ఆటంకం కలిగించారని, ఆ జడ్పీటీసీ, ఎంపీటీసీలు కొంతమందిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు పత్రాన్ని ఎస్ఐ నరసింహుడుకు అందజేశారు.





ఎంపీడీవో కార్యాలయం వద్ద నిరసన తెలియచేస్తున్న టీడీపీ వర్గీయులను అడ్డుకుంటున్న పోలీసులు, మరోవైపు మోహరించిన వైసీపీ వర్గీయులు

గుండెపోటుతో హెడ్‌కానిస్టేబుల్ మృతి




దాసరి భాస్కర్ (ఫైల్)

రాయచోటిటౌన్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): రాయచోటి పట్టణంలోని అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న దాసరి భాస్కర్ (51) గురువారం గుండెపోటుతో మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే... లక్కిరెడ్డిపల్లె మండలం గాండ్లవానిపల్లెకు చెందిన హెడ్ కానిస్టేబుల్ దాసరి భాస్కర్ రాయచోటి అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్నాడు. నాలుగు నెలల క్రితం హైదరాబాదులో గుండె జబ్బుకు చికిత్స చేయించుకుని వచ్చాడు. ఈ క్రమంలో రెండు రోజులు ఆయాసంతో బాధపడుతున్న భాస్కర్‌కు గురువారం మరోసారి గుండెపోటు రావడంతో మృతి చెందాడు.

ఇతడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. విషయం తెలుసుకున్న రాయచోటి అర్బన్ సీఐ చంద్రశేఖర్‌తో పాటు ఎస్ఐలు, సహచర పోలీసులు హెడ్‌కానిస్టేబుల్ మృతదేహాన్ని సందర్శించి వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సుగవాసి ప్రసాద్‌బాబు వారి ఇంటి వద్దకు వెళ్లి మృతదేహాన్ని సందర్శించి వారి కుటుంబానికి ధైర్యం చెప్పారు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య



పకీర్‌సాబ్ మృతదేహం

రాయచోటిటౌన్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): రాయచోటి పట్టణంలోని మాసాపేటలో వరిగ రోడ్డులో నివాసం ఉంటున్న పకీర్‌సాబ్ (68) అనే వ్యక్తి చెడు వ్యసనాలకు బానిసై అప్పుల బాధతో గురువారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కొంతకాలంగా మద్యం, జూదం తదితర చెడు వ్యసనాలకు అలవాటు పడ్డ పకీర్‌సాబ్ అక్కడక్కడా అప్పులు చేస్తూ వాటిని తిరిగి తీర్చలేక ఒత్తిడి ఎక్కువ కావడంతో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇతనికి భార్య, పిల్లలు ఉన్నారు. మృతుడి కుమారుడు మౌలానా ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాయచోటి ఏరియా ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు అర్బన్ సీఐ చంద్రశేఖర్ తెలియజేశారు.

బాధితులకు న్యాయం చేస్తాం : ఆర్డీఓ



రోడ్డు పనులు పరిశీలిస్తున్న ఆర్డీఓ

బ్రహ్మంగారిమఠం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): గ్రీన్‌ఫీల్డ్ నేషనల్ హైవే బెంగళూరు-విజయవాడ పనుల కోసం భూములు కోల్పోయిన వారికి న్యాయం చేస్తామని బద్వేలు ఆర్డీవో చంద్రమోహన్ తెలిపారు. గురువారం మల్లేపల్లె పరిసరాల్లో రోడ్డు పనులను ఆయన పరిశీలించారు. భూములు కోల్పోయి నష్టపరిహారం రాని వారితో మాట్లాడారు. తహసీల్దారు దామోదర్‌రెడ్డి లబ్ధిదారుల వివరాలను ఆర్డీఓకు అందించారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు చెన్నుపల్లి సుబ్బారెడ్డి మండల నాయకులు సాంబశివారెడ్డి, పూజా శివయ్య యాదవ్, శ్రీను, రమేశ్, మేకల సుధాకర్, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

డీఆర్పీలుగా ఉపాధి అవకాశాలు

● డీఆర్డీఏ పీడీ ఆనందనాయక్

కడప ఎన్టీఆర్ సర్కిల్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీలో జిల్లా రీసోర్స్ పర్సన్స్(డీఆర్‌పీ)గా పనిచేసేందుకు ఉపాధి అవకాశాలు ఉన్నట్లు డీఆర్డీఏ పీడీ ఆనందనాయక్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో పీఎం ఫార్మలైజేషన్ ఆఫ్ మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్‌ప్రైజెస్ (పీఎం ఎఫ్‌ఎంఈ)ని సమర్థవంతంగా అమలు చేసేందుకు మండల స్థాయిలో రీసోర్స్ పర్సన్‌లను ఎంపిక చేయ డం జరుగుతుంది. ఏదైన డిగ్రీ ఉత్తీర్ణత సాధించి కంప్యూటర్ ఇంటర్నెట్ ప్రావీణ్యం కలిగి ఉండాలని తెలిపారు. ప్రయాణాలు చేసేందుకు ఆసక్తి కలిగి ఉండి స్మార్ట్‌ఫోన్ వినియోగించే వారు అర్హులన్నారు. గత ఏడాది నవంబరు 1వ తేదీ నాటికి 21 నుంచి 30ఏళ్లు కలిగిన వారై ఉండాలన్నారు. ఫుడ్ ప్రాసెసింగ్ సహజ వనరుల అభివృద్ధి రం గంలో అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఈనెల 5లోపు మండలంలో ఉన్న వెలుగు కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేయించుకోవాల్సిందిగా సూచించారు. 8వ తేదీ రాజంపేట రోడ్డులోని టీటీడీసీలో రాత పరీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎంపికైన వారికి రూ.20వేలు ప్రోత్సాహక ప్రతిపాదికన చెల్లించడం జరుగుతుందన్నారు. అర్హతలు, ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈనెల 5లోపు ఆయా మండల సమాఖ్య-వెలుగు కార్యాలయాల్లో తమ పేర్లు రిజిస్ట్రేషన్ చేయించుకోవాల్సిందిగా ప్రకటనలో కోరారు.

5న జిల్లా బాలుర హాకీ జట్ల ఎంపికలు

పులివెందుల టౌన్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): వైఎస్ఆర్ కడప జిల్లా బాలుర జూనియర్, సబ్ జూనియర్ హాకీ జట్ల ఎంపికలు ఈ నెల 5న పులివెందులలోని వైఎస్ఆర్ ఇంటిగ్రేటెడ్ స్పోర్ట్స్ అకాడమీలో జరగనున్నట్లు హాకీ కడప జిల్లా సెక్రటరీ ఎం.శేఖర్ తెలిపారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ పులివెందులలో ఎంపికైన సబ్ జూనియర్ బాలుర జట్టు ఈ నెల 17వ తేదీ నుంచి 19 వరకు మదనపల్లెలో జరిగే 14వ రాష్ట్రస్థాయి బాలుర సబ్ జూనియర్ చాంపియన్‌షిప్‌లో పాల్గొంటుందన్నారు. ఈఎంపికలకు హాజరయ్యే క్రీడాకారులు ఖచ్చితంగా 1.1.2009 తరువాత జన్మించిన వారై ఉండాలన్నారు. అదే విధంగా జూనియర్ విభాగంలో ఎంపికైన బాలుర జట్టు ఈనెల రెండో వారంలో కాకినాడలో జరిగే ఏపీ రాష్ట్ర స్థాయి జూనియర్ బాలుర చాంపియన్ షిప్‌లో పాల్గొంటుంద న్నారు. ఇందులో పాల్గొనే క్రీడకారులు 1.1.2006వ తేదీ తరువాత జన్మించిన వారై ఉండాలన్నారు. ఈ ఎంపికలో పాల్గొనే క్రీడాకారులు తమ వెంట ఆధార్‌కార్డు, బర్త్ సర్టిఫికెట్‌లను తీసుకుని ఈ నెల 5న ఉదయం 9గంటలకు పులివెందుల స్పోర్ట్స్ అకాడమీలో రిపోర్టు చేయాలని ఆయన తెలిపారు.

జువారిలో కేంద్ర మంత్రికి విందు

ఎర్రగుంట్ల, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): కేంద్ర శాస్త్ర సాంకేతిక, భౌగోళికశాస్త్ర శాఖ మంత్రి డాక్టర్ జితేంద్రసింగ్ గురువారం ఎర్రగుంట్లలోని జువారి కర్మాగారం అతిథి గృహానికి వచ్చారు. స్థానిక యాజమాన్యం, నాయకులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. అక్కడ ఆయన మధ్యాహ్నం భోజనం చేసి విశ్రాంతి తీసుకు న్నారు. అనంతరం ఎమ్మెల్యే, కలెక్టర్ తదితరులతో కలిసి గండికోటకు వెళ్లారు. ఆయన వెంట ఎమ్మెల్యే ఆదినారా యణరెడ్డి, టీడీపీ ఇన్‌చార్జి సి.భూపేష్‌రెడ్డి, బీజేపీ నాయకులు ఉన్నారు.

పరిశుభ్రతకు ప్రాధాన్యత

వల్లూరు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ్య పుణ్యక్షేత్రమైన పుష్పగిరి క్షేత్రం అబివృద్ధితో ముందుకు తీసకెళ్తారని దేవాదాయ అసిస్టెంటు కమిషనరు మల్లికార్జున అన్నారు. గురువారం మండల పరిధిలోని క్షేత్రాన్ని ఆయన పరిశీలించారు. ముందుగా ఆలయం చుట్టుపక్కల ఉన్న చెత్త చెదారాన్ని మైదుకూరు, ప్రొద్దుటూరు నుంచి వచ్చిన భక్త సమూహంతో పరిశుభ్రం చేయించారు. అనంతరం వారందరికీ ధన్యవాదాలు తెలిపా రు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరశుభ్రతకే తాను మొదట ప్రాధాన్యత ఇస్తామన్నారు.

ఇంటర్నేషనల్ షూటింగ్ బాల్‌గేమ్స్‌కు హరిబాబు ఎంపిక



పోరుమామిళ్ల, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ఇంటర్నేషనల్ షూటింగ్ బాల్‌గేమ్స్‌కు రాయపాటి హరిబాబు అనే విద్యార్థి ఎంపికయ్యాడు. పోరుమామిళ్ల మండలం నాగులకుంట్లకు చెందిన హరిబాబు త్వరలో నేపాల్‌లో జరగబోయే ఇంటర్నేషనల్ గేమ్స్‌లో ఆడనున్నాడు. హరిబాబు జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో గోల్డ్ మెడల్ సాధించి షూటింగ్ బాల్ ఇంటర్నేషనల్‌కు ఎంపికయ్యాడు. ప్రస్తుతం ఈ విద్యార్థి కడప ఐటీఐలో డీజిల్ మెకా నిక్‌గా చదువుతున్నాడు.

లా, బీఈడీ అడ్మిషన్లకు రిజిస్ట్రేషన్ గడువు పెంపు

అమరావతి, జనవరి 2(ఆంధ్రజ్యోతి): లా, బీఈడీ కోర్సుల్లో అడ్మిషన్లకు రిజిస్ట్రేషన్ల గడువును ఈనెల 5 వరకు పొడిగించినట్లు ఉన్నత విద్యామండలి ఓ ప్రకటనలో తెలిపింది. యూనివర్సిటీల్లో స్పాట్ అడ్మిషన్లు, ప్రైవేటు లా, బీఈడీ కాలేజీల్లో కేటగిరీ బీ అడ్మిషన్లకు ఈ గడువు వర్తిస్తుందని తెలిపింది. అభ్యర్థుల వినతి మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొంది. ఇకపై ఎలాంటి పొడిగింపు ఉండదని స్పష్టం చేసింది.

మధ్యాహ్న భోజనంలో శనివారం మెనూ మార్పు

అమరావతి, జనవరి 2(ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజన పథకంలో శనివారం అందించే ఆహారం మెనూను సవరిస్తూ మధ్యాహ్న భోజనం పథకం డైరెక్టర్ బి.శ్రీనివాసరావు గురువారం ఉత్తర్వులు జారీచేశారు. ప్రస్తుత మెనూ ప్రకారం శనివారం రోజున విద్యార్థులకు ఆకు కూర అన్నం(పాలకూర, కొత్తిమీర, కరివేపాకు, పుదీనా), పప్పుచారు, స్వీట్ పొంగల్, రాగి జావ ఇస్తున్నారు. ఇక నుంచి ఆకు కూర అన్నం స్థానంలో సాధారణ అన్నం పెట్టి, స్థానికంగా అందుబాటులో ఉండే కూరగాయలతో కూర, స్వీట్ పొంగల్, రాగి జావ అందించాలని ఆదేశించారు.

నేడు జిల్లాస్థాయి సైన్స్‌ఫెయిర్

● 36మండలాల నుంచి రానున్న ప్రాజెక్టులు

● కడప ఉప విద్యాధికారి జి.రాజగోపాల్‌రెడ్డి



జిల్లా స్థాయి సైన్స్‌ఫెయిర్‌పై కమిటీ సభ్యులకు సూచనలు ఇస్తున్న కడప ఉప విద్యాధికారి రాజగోపాల్‌రెడ్డి

కడప ఎడ్యుకేషన్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): కడప మున్సిపల్ హైస్కూల్ మెయిన్‌లో జిల్లాస్థాయి సైన్స్ ఫెయిర్‌ను శుక్రవారం ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఉప విద్యాశాఖాధికారి రాజగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం జిల్లా సైన్స్ ఆఫీసర్ యబనైజర్ ఇమ్మానుయేల్, కడప మండల విద్యాశాఖాధికారి గంగిరెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాగమణి ఆధ్వర్యంలో కమిటీ సభ్యులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కమిటీలోని ఉపాధ్యాయులందరూ సమష్టి కృషితో సైన్స్ ఫెయిర్‌ను విజవయంతం చేయాలని సూచించారు. జిల్లాలోని 36 మండలాల నుంచి వ్యక్తిగత విభాగంలో 36, గ్రూపు విభాగంలో 36, ఉపాధ్యాయ విభాగంలో 36 చొప్పున సైన్స్ ప్రాజెక్టులు ప్రదర్శిస్తారని తెలిపారు. ఇందులో ఉత్తమ ప్రాజెక్టును ప్రతి విభా గంలో రెండు ఎంపిక చేస్తామన్నారు. సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ, ఉపాధ్యాయుల పర్యవేక్షణ, విద్యార్థుల సందర్శన వంటి కార్యక్రమాలతో జిల్లాస్థాయి సైన్స్ ఫెయిర్‌ను విజయవంతం చేయాలని సూచించారు. కమిటీ సభ్యులు దశరథరామిరెడ్డి, కేశవరెడ్డి, నిత్యానందరెడ్డి, గంగాధర్, కృష్ణకిషోర్, విజయప్రసాద్, బాలకృష్ణ, శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైవీయూకు ఎఫ్‌ఎస్‌ఎస్‌ఏఐ సర్టిఫికెట్



సర్టిఫికెట్లతో వీసీ కృష్ణారెడ్డి, ప్రిన్సిపాల్ రఘునాథరెడ్డి, రిజిస్ట్రార్ పద్మ తదితరులు

కడప ఎడ్యుకేషన్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): యోగివేమన యూనివర్సిటీ వసతి గృహాలలో నాణ్యమైన భోజనం, ఆహార పదార్థాలు విద్యార్థులకు ఇస్తున్నట్లు గుర్తించి ఫుడ్ సేఫ్టీ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఎస్ఏఐ) సర్టిఫికెట్ లభించింది. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ కృష్ణారెడ్డి, రిజిస్ట్రార్ పుత్తా పద్మ సమక్షంలో వైవీయూ కళాశాల ప్రిన్సిపాల్, విశ్వవిద్యాలయ వసతి గృహాల చీఫ్ వార్డన్ ఆచార్య ఎస్.రఘునాథరెడ్డికి ఆంధ్రప్రదేశ్ రూకో ప్రాజెక్టు హెడ్ అల్లూరి సంపత్ కుమార్ ఎఫ్ఎస్ఎస్ఏఐ సర్టిఫికెట్‌ను అందజేశారు. సంపత్‌కుమార్ మాట్లాడుతూ విశ్వవిద్యాలయ వసతిగృహాల్లో లభించే ఆహార పదార్థాలను ఆకస్మికంగా పరిశీలన చేసినపుడు నిపుణులు నాణ్యతా ప్రమాణాలను గుర్తించారన్నారు. భవిష్యత్తులో ఈ సర్టిఫికెట్ ఇలానే కొనసాగించాలంటే అధికారులు, వార్డన్లు నిత్య పర్యవేక్షణ అవసరమన్నారు. వీసీ కృష్ణారెడ్డి మాట్లాడుతూ విశ్వవిద్యాలయ ప్రాంగణంలోని పెన్నా, పాపాఘ్ని, చిత్రావతి, చెయ్యేరు మెస్‌లకు ఎఫ్ఎస్ఎస్ఏఐ సర్టిఫికెట్ రావడం సంతోషదాయకమన్నారు. అనంతరం రిజిస్ట్రార్ ఆచార్య పద్మ, ప్రిన్సిపల్ ఎస్.రఘునాథరెడ్డి మాట్లాడారు. సమావేశంలో ఐక్యుఏసీ డైరెక్టర్ సుబ్రమణ్యంశర్మ, సహాయ డైరెక్టర్ సుభాష్‌చంద్ర, పీఆర్ సెల్ సంచాలకులు డాక్టర్ పి. సరిత, వార్డన్లు తదితరులు పాల్గొన్నారు.

కువైత్‌లో వేంపల్లె వాసి మృతి



శివకుమార్ (ఫైల్)

వేంపల్లె, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): వేంపల్లె శ్రీరామ్‌నగర్‌కు చెందిన సగినాల శివకుమార్ (38) కువైత్‌లో బుధవారం మృతి చెందాడు. కుటుంబ సభ్యుల వివ రాల మేరకు... వీరన్నగట్టుపల్లెకు చెందిన శివకుమార్ వేంపల్లె శ్రీరామ్‌నగర్‌లో భార్య పిల్లలతో కలసి నివాసం ఉండేవాడు. ఇక్క డ సరైన ఉపాధి దొరక్క ఎనిమిది సంవత్సరాల క్రితం కువైత్‌కు వెళ్లాడు. ఏడాదికో రెండేళ్లకు ఒకసారి ఇంటికొచ్చి వెళ్లేవాడు. ఇటీవల వచ్చిన శివకుమార్ రెండు నెలల క్రితం మళ్లీ కువైత్‌కు వెళ్లాడు. బుధవారం కువైత్‌లోని గదిలో పడుకొని ఉండగా గుండెపోటు రావడంతో మృతి చెందాడు. మధ్యాహ్నం తర్వాత అక్కడి సేఠ్ ఇతరులు గదిలోకి వెళ్లిచూడగా అప్పటికే మృతి చెందినట్లు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. కువైత్‌లో ఉన్న బంధువుల సహకారంతో మృతదేహాన్ని వేంపల్లెకు తెప్పించేందుకు ప్రయత్నిస్తున్నారు. ప్రభుత్వం స్పందించి పేదకుటుంబాన్ని ఆదుకోవాలని వేడుకుంటున్నారు.

వివాహిత ఆత్మహత్య



ఎర్రగుంట్ల, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తుమ్మలపల్లికి చెందిన వసంనేత్ర (18) బుధవారం రాత్రి ఇంట్లో ఉరివేసుకుంది. డబ్బుల విషయంలో భర్త నాగరాజు మందలించడంతో మనస్తాపం చెంది ఆత్మహత్యకు పాల్పడినట్లుగా తెలిసింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రొద్దుటూరు ఆసుపత్రికి తరలించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కడప క్రైం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): కడప నగరం అక్కాయపల్లె వద్ద టీవీఎస్ వాహనంలో ఓ వ్యక్తి వెళుతూ కింద పడి తీవ్రగాయాలయ్యాయి. రిమ్స్‌లో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు తాలుకా పోలీసులు తెలిపారు. అక్కాయపల్లె చెందిన హర్షద్ అలీ (58) ఆర్టీసీలో పనిచేస్తున్నాడు. బుధవారం రాత్రి టీవీఎస్ వాహనంలో ఇంటికి వెళుతుండగా స్కూటరుపై నుంచి కింద పడటంతో గాయపడ్డాడు. స్థానికులు రిమ్స్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. ఈమేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

డబ్బు కోసం మా నాన్నను మనవడే చంపాడు

● నెల తరువాత కొడుకు ఫిర్యాదు

● విచారణ చేపడుతున్న పోలీసులు

మైదుకూరు రూరల్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): మా నాన్న పొలం అమ్మిన డబ్బులు ఇవ్వాలని వేధించి.. ఆయన మనవడు చంపేశాడని కుమ్మరి రమేష్ గురువారం మైదుకూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలోని శెట్టివారిపల్లెకు చెందిన వీరారెడ్డికి మొదటి భార్య కుమారుడు రాఘువరెడ్డితో పాటు ముగురు అక్క చెల్లెళ్లు, రెండో భార్యకు రమేష్ ఏకైక సంతానం. గతంలో అందరూ శెట్టివారిపల్లెలోనే నివాసం ఉండేవారు. తరువాత వీరారెడ్డి మొదటి భార్య, రెండో భార్యకు సఖ్యత లేకపోవడంతో రెండో భార్య సుబ్బమ్మ, అమె కుమారుడు రమేష్ ప్రొద్దుటూరు మండలం గోప వరం సమీపంలోని యానాది కాలనీలో నివశించేవారు. వీరారెడ్డి వస్తూ పోతుండేవాడు. ఈ నేపథ్యంలో మొదటి భార్య కుమారుడు రాఘువరెడ్డికి కరెంటుషాక్ తగిలి మృతి చెందాడు. ఆ తరువాత కొంత కాలానికి వీరారెడ్డి మొదటి భార్య, రెండో భార్య అనా రోగ్యంతో మరణించారు. వీరారెడ్డికి పక్షవాతం రావడంతో ఆయనకు నేనే దగ్గరుండి వైద్యం చేయించి బాగు చేశానని రమేష్ తెలిపారు. తొమ్మిది నెలల క్రితం వీరారెడ్డి పేరు మీద ఉన్న ఎకరం పొలం అమ్మగా ఏడు లక్షల రూపాయల వచ్చిందని, ఆ డబ్బులు ఇవ్వాలని మొదటి భార్య మనవడు హరినాథ్‌రెడ్డి తరచూ వేధిసున్నట్లు చెప్పేవాడని రమేష్ ఫిర్యాదులో పేర్కొ న్నారు. గత నెల 6వ తేదీ మా నాన్న చనిపోయాడని తెలిసి అంత్యక్రియలు చేసి తిరిగి మా గ్రామానికి వచ్చేశామని తెలి పారు. అయితే హరినాథ్‌రెడ్డి మా నాన్న వీరారెడ్డిని ముక్కు నోరు మూసి చంపివేశాడని గ్రామస్తుల ద్వారా సమాచారం తెలియడంతో గురువారం మైదుకూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. మైదుకూరు డీఎస్పీ రాజేంద్రప్రసాద్ ఆదేశాల మేరకు సీఐ హసం, ఎస్ఐఐ చిరంజీవి విచారణ చేపట్టారు.

రేపు వామికొండ జలాశయంలో చేపల వేటకు వేలం

ముద్దనూరు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ఉప్పలూరు గ్రామ సమీపంలోనున్న వామికొండ జలాశయంలో చేపల వేటకు సంబంధించి శనివారం వేలం నిర్వహిస్తున్నట్లు మైలవరం మత్స్య అభివృద్ధి అధికారి కిరణ్‌కుమార్ తెలిపారు. కొలవలి గ్రామ సచివాలయం వద్ద ఉదయం 10-30గంటలకు వేలం ప్రారంభమవుతుందని, పాటలో డిపాజిట్ చెల్లించి పాల్గొనవచ్చని తెలిపారు.

10వ తరగతి మెటీరియల్ విద్యార్థులకు ఎంతో ఉపయోగం

●కడప ఉప విద్యాధికారి రాజగోపాల్‌రెడ్డి

కడప ఎడ్యుకేషన్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ఎస్టీయూ రూపొందించిన పదో తరగతి పరీక్షల మెటీరియల్ విద్యార్థులకు ఎంతో ఉపయోగకరమని కడప ఉప విద్యాధికారి జి.రాజగోపాల్‌రెడ్డి తెలిపారు. గురువారం నగరంలోని మున్సిపల్ హైస్కూల్ మెయిన్‌లో ప్రధానోపాధ్యాయురాలు నాగమణి, ఎస్టీయు జిల్లా అధ్యక్షులు ఇలియాస్ బాష ఆధ్వర్యంలో పదో తరగతి మెటరియల్ విద్యార్థులకు అందజేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెటీరియల్ చాలా బాగా ఉందని కొనియాడారు. విద్యార్థులు ఈ మెటీరియల్ ఉపయోగించుకొని మంచి మార్కులు, అలాగే తరగతి మొత్తం మంచి ఉత్తీర్ణత శాతాన్ని నమోదు చేయాలని కోరారు. ఎస్టీయూ రాష్ట్ర మున్సిపల్ కన్వీనర్ టి.రవిశంకర్‌రెడ్డి పదవ తరగతి



మెటీరియల్ అందిస్తున్న కడప ఉప విద్యాధికారి రాజగోపాల్‌రెడ్డి, హెచ్‌ఎం నాగమణి

విద్యార్థులందరికీ ఉచితంగా మెటీరియల్‌ను అందించారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా నాయకులు మహబూబ్‌బాషా, అబ్దుల్ వాజిద్ తదితరులు పాల్గొన్నారు

జాతీయ స్థాయికి జిల్లా వారసత్వ సంపద ఘనత

కడప నాగరాజుపేట, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): జిల్లా వారసత్వ సంపద ఘనతను జాతీయ స్థాయికి తీసుకెళ్లడం అభినందనీయమని యోగి వేమన విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కె.కృష్ణారెడ్డి అన్నారు. గురువారం స్థానిక భారత జాతీయ కళాసంస్కృతి, వారసత్వ పరిరక్షణ సంస్థ (ఇంటాక్), లయన్స్ క్లబ్ ఆఫ్ కడప అన్నమయ్య, రాయలసీమ టూరిజం అండ్ కల్చరల్ సొసైటీ, పోతుల చిన్న కంచమ్మ, చిన్న ఓబులరెడ్డి, సరస్వతమ్మ స్మారక ట్రస్టుల ఉమ్మడి ఆధ్వర్యంలో నగరానికి చెందిన మానస ఇన్ సమావేశ మందిరంలో ఇన్‌టాక్ వార్షిక సమావేశం నిర్వహించారు. వీసీ మాట్లాడుతూ ఇన్‌టాక్ కడప చాప్టర్ కృషి ప్రశంసనీయమన్నారు. సంస్థ కోకన్వీనర్ పీవీ సుబ్బారెడ్డి, లయన్స్ క్లబ్ సంస్థ అధ్యక్షులు అనంతంబొట్ల వెంకటసుబ్బయ్య, పూర్వ అధ్యక్షులు లయన్ పోతుల వెంకటరామిరెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

తెగుళ్లతో శనగ రైతు కుదేలు

● రాలిపోతున్న పూత ● 20 వేల ఎకరాల్లో పంట నష్టం ● దిగుబడి పూర్తి స్థాయిలో తగ్గుతుందని రైతుల ఆవేదన

సింహాద్రిపురం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ఇటీవల వరుస తుఫానులు, తెగుళ్లతో రబీలో సాగు చేసిన బుడ్డ శనగ పూత రాలిపోవడంతోంది. దీంతో దిగుబడి పూర్తి స్థాయిలో తగ్గనుంది. గతంలో వాతావరణంలో చోటుచేసుకున్న మార్పులతో మొగిలి ఏర్పడి పూత నల్లగా మారింది. తెగుళ్లబారిన పడి కొంతమేర పంట దెబ్బతింది. ప్రస్తుతం తుఫాన్ తాకిడికి పూత రాలిపోవడం మరో పెద్ద దెబ్బని చెప్పవచ్చు. మండలంలోని 20 పంచాయతీల్లో సుమారు 20వేల ఎకరాల్లో రైతులు బుడ్డశనగ సాగు చేశారు. కోటి ఆశలతో పంటను సాగు చేసిన రైతుల ఆశలు అడియాశలయ్యాయి. సాగు చేసిన రెండు అదున్లు(ముదురు, నేత) పంట దెబ్బతిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శనగ పంటలో పూత, పిందె రెండూ లేక పోవడంతో రైతులు దిగాలు పడుతున్నారు. రైతులు లక్షలాది రూపాయలు వెచ్చించి పంట సాగుకు ఖర్చు చేశారు. తీరా పంట చేతికొచ్చే సమయంలో ఇలాంటి విపత్కర పరిస్థితులు ఏర్పడటంతో రైతులు జీర్ణించుకోలేకపోతున్నారు. అప్పులు చేసి పంట సాగు చేస్తే కనీసం పెట్టుబడులైనా వస్తాయా లేదా అనే సందేహంలో ఉన్నారు. నష్టాల బాటలో ఉన్న రైతులను ప్రభుత్వం ఆర్థిక సాయం చేసి ఆదుకోవాలని అన్నదాతలు కోరుతున్నారు.



సింహాద్రిపురం మండలంలో దెబ్బతిన్న బుడ్డ శనగ పంట

వర్షాలతో శనగ పంటకు దెబ్బ

ఇటీవల కురుస్తున్న తుఫాన్, వర్షాలతో పూత రాలి పంట దిగుబడి తగ్గే అవకాశం ఉంది. రైతులు నష్టపోయే విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. రైతులకు తగు న్యాయం జరిగేలా చూస్తాం.

- శివమోహన్‌రెడ్డి, మండల వ్యవసాయాధికారి

ఐదెకరాల్లో శనగ సాగుచేశా



ఐదు ఎకరాల్లో బుడ్డశనగ సాగుకు రూ.75వేలు ఖర్చు చేశాను. ప్రస్తుతం 10శాతం కూడా పంట దిగుబడి వచ్చేటట్లు లేదు. పంటల సాగుకు దిగాలంటేనే భయమేస్తోంది. ప్రభుత్వమే ఆదుకోవాలి.

- సింగం వాసుదేవరెడ్డి, శనగ రైతు, సింహాద్రిపురం

యూటీఎఫ్ స్వర్ణోత్సవాలను జయప్రదం చేయండి

చెన్నూరు, జనవరి 2 ఆంధ్రజ్యోతి: కాకినాడలో ఈనెల 5 నుంచి 8 వరకు జరిగే ఏపీ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ స్వర్ణోత్సవ మహాసభలను జయప్రదం చేయాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా పిలుపునిచ్చారు. స్థానిక బాలికల ఉన్నత పాఠశాల వద్ద ఎంఈఓలు గంగిరెడ్డి, సునీత, హెచ్‌ఎం రమణయ్య చేతులమీదుగా కరపత్రాలను విడుదల చేశారు.

అభిప్రాయాలను రాతపూర్వకంగా అందించాలి

వీరపునాయునిపల్లె, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): తమ అభిప్రాయాలను రాతపూర్వకంగా అందించాలని ఏఎస్‌డబ్ల్యూఓ స్వర్ణలత గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎస్సీ వర్గీకర్గకరణ విషయంలో ప్రభుత్వం రాజీవ్‌రంజన్ మిశ్రా ఆధ్వర్యంలో ఏకసభ్య కమిషన్‌ను నియమించిందని తెలిపారు. కమిషన్ 3వ తేదీన స్థానిక కలెక్టరేట్‌కు చేరుకోనుందని, ఉదయం 10.30గటలకు కలెక్టరేట్‌లోని సభాభవన్‌లో సమావేశం నిర్వహించనున్నారని తెలిపారు. కావున ఎస్సీ ఉపకులాల సభ్యులు, సంఘాల వారు హాజరై తమ అభిప్రాయాలను రాతపూర్వకంగా అందించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమానికి వచ్చేవారు తగు ధ్రువీకరణ పత్రాలతో హాజరుకావాలని కోరారు.

పూలే జయంతిని జయప్రదం చేయండి

కడప మారుతీనగర్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): భారతదేశ తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే జయంతి కార్యక్రమాన్ని ఈనెల 3వ తేదీ శుక్రవారం ఉదయం 10 గంటలకు బీసీ భవన్‌లో ఏర్పాటు చేస్తున్నామని, విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు బత్తల లింగమూర్తి, వర్కింగ్ ప్రెసిడెంట్ గోవిందు నాగరాజు పిలుపునిచ్చారు. గురువారం బీసీ భవన్‌లో వారు విలేకరులతో మాట్లాడారు.

పుత్తాకు కొత్త సంవత్సర శుభాకాంక్షలు



పుత్తాకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతున్న ఎస్సీ సెల్ నాయకులు

కమలాపురం రూరల్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): టీడీపీ రాష్ట్రఉపాధ్యక్షుడు కమలాపురంనియోజకవర్గ ఇన్‌చార్జ్ పుత్తా నరసింహరెడ్డికి పెద్దచెప్పలి గ్రామానికిచెందిన ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు రఘునాథ్ ఆధ్వర్యంలో నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. జనవరి 1న పుత్తా అందుబాటులో లేకపోవడంతో గురువారం శుభాకాంక్షలు తెలిపారు.

ఎమ్మెల్సీ రామచంద్రయ్యను పరామర్శించిన బొత్స



ఎమ్మెల్సీ రామచంద్రయ్యను పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ బొత్స... పార్థసారధిరెడ్డి

కడప ఎర్రముక్కపల్లె, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ రామచంద్రయ్య కుమారుడువిష్ణు స్వరూప్ అకాల మృతి నేపథ్యంలో ఎమ్మెల్సీ కుటుంబాన్ని వైసీపీ నేత మాజీ మంత్రి ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ పరామర్శించారు. గురువారం కడప నగరం కోఆపరేటివ్‌కాలనీ ఎమ్మెల్సీ నివాసంలో ఆయన ఎమ్మెల్సీ రామచంద్రయ్యతో కలిశారు. ఈ కార్యక్రమంలో పలలువురు వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

రామచంద్రయ్యను పరామర్శించిన పార్థసారధిరెడ్డి

వేముల, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పేర్ల పార్థసారధిరెడ్డి ఎమ్మెల్సీ సి.రామచంద్రయ్యను పరామర్శించారు. గురువారం రామచంద్రయ్య నివాసంలో పార్థసారధిరెడ్డి కలిశారు. ఇటీవల ఎమ్మెల్సీ రామచంద్రయ్య కుమారుడు మృతిచెందారు. ఆయనను పరామర్శించి పార్థసారధిరెడ్డి ధైర్యం చెప్పారు.

రేపు డీఈఓ కార్యాలయం ఎదుట ధర్నా

కడప ఎడ్యుకేషన్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులను తీవ్రంగా దుర్భాషలాడుతూ మానసిక క్షోభకు గురిచేస్తున్న జిల్లా విద్యాశాఖాధికారి మాకొద్దని ఈనెల 4వ తేదీన డీఈఓ ఆఫీస్ ఎదురుగా ధర్నా చేస్తున్నట్లు వైఎస్సార్ జిల్లా ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక నాయకులు తెలిపారు. గురువారం కడప నగరం జిల్లా ఉపాధ్యాయ భవన్‌లో ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సంఘాల ఐక్యవేదిక నాయకులందరు సంయుక్తంగా మాట్లాడుతూ కడప జిల్లా విద్యాశాఖ అధికారిగా బాధ్యతలు తీసుకున్న యు.మీనాక్షి పాఠశాలలు సందర్శించినపుడు అక్కడిమండల విద్యాశాఖ అధికారులను, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులను దుర్భాషలాడుతూ, మానసిక క్షోభకు గురిచేస్తూ బానిసలకంటే హీనంగా చూస్తున్నారని పేర్కొన్నారు. ఉపాధ్యాయ ఐక్యవేదిక నా యకులు ఇటువంటి డీఈఓ కడప జిల్లాకు ఇక ఉండకూడదని, డీఈఓ మాకు వద్దని ఉపాధ్యాయ ఐక్యవేదిక నాయకులు ఈనెల 4న డీఈఓ కార్యాలయం ఎదుట ధర్నాకు పిలుపునిచ్చారు. కావున ధర్నాకు హాజరుకావాలని కోరారు. ఈ సమావేశంలో ఉపాధ్యాయ సంఘాలు ఎస్టీయు, యూటీఎఫ్, పీఆర్‌టీయు, ఏపీటీఎఫ్ 257, ఏపీటీఎఫ్ 1938, పీఎస్టీయూ నాయకులు, ఆర్‌యుపిపి, స్కూల్ అసిస్టెంట్ అసోసియేషన్, ఎస్సీ ఎస్టీ అసోసియేషన్ నాయకులు ఎస్సీపీ అసోసియేషన్, ఆర్జేయూపీ, హౌసింగ్ బిల్డింగ్ సొసైటీ, ఎస్టీఎఫ్, ఎస్ఆర్‌టీఎఫ్, ఎన్‌టీఏ, ఎస్ఎల్‌టీఏ, సీపీఎస్ అసోసియేషన్, వైఎస్సార్ టటీచర్ అసోసియేషన్, బహుజన టటీచర్స్ అసోసియేషన్, ఐటా అసోసియేషన్, పీఈటీ అసోసియేషన్ల నేతలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు శివారెడ్డి

రేపటి నుంచి సీపీఎం జిల్లా మహాసభలు

కడప సెవెన్ రోడ్స్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): సీపీఎం కడప జిల్లా 12వ మహాసభలు ఈనెల 4,5 తేదీల్లో కడప నగరంలో రెండు రోజుల పాటు జరగనున్నాయని, ఈ మహాసభల విజయవంతానికి ప్రజలు సహకరించాలని ఆ పార్టీ నగర కార్యదర్శి రామమోహన్ విజ్ఞప్తి చేశారు. గురువారం కడపలోని మృత్యుంజయకుంటలో ఉన్న సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రామమోహన్ తెలిపారు. 4న ఉదయం 10 గంటలకు కడప నగరంలోని కోటిరెడ్డి సర్కిల్ వద్ద ఉన్న జియాన్ కళాశాల నుంచి ప్రదర్శన ప్రారంభమవుతుదని ఆయన తెలిపారు. మహాసభకు ముఖ్యఅతిథులుగా సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు ఎం ఏ గఫూర్, పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ప్రభాకర్‌రెడ్డి హాజరవుతున్నారని ఆయన తెలిపారు. ఈ మహాసభల విజయవంతానికి జిల్లా జిల్లా ప్రజానీకం సహకరించి జయప్రదం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు దస్తగిరిరెడ్డి, నగర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రూ.10వేలకు పెంచడం హర్షణీయం

వేంపల్లె, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ఎన్డీఏ ప్రభుత్వం రైతులకు పెట్టుబడి సాయం కింద అందించే మొత్తం రూ.6వేల నుంచి రూ.10వేలకు పెంచడం హర్షణీయమని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గాలి హరిప్రసాద్ అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ 2019 నుంచి రైతులకు కిసాన్ సమ్మాన్ నిధి ద్వారా ఎలాంటి అవినీతి జరగకుండా నేరుగా రైతుల ఖాతాల్లో జమ అవుతోందన్నారు. రైతుల జీవితాల్లో గణనీయమైన మార్పు తెచ్చేందుకు కేంద్రం కేటాయింపులను రూ. 69,515కోట్లకు పెంచుతూ కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపిందన్నారు. అలాగే 50కిలోల డీఏపీ ఎరువుల బస్తాను రూ.1350 చొప్పున రైతులకు అందజేసేందుకు రూ.3850 కోట్ల ప్రత్యేక ప్యాకేజీని పొడిగిస్తున్నట్లు వెల్లడించారన్నారు. ప్రధాని మోదీ రైతు సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తూ 2025లో రైతులకు కానుకగా ఇవ్వనున్నారన్నారు.

ఎన్జీవో సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిని కలిసిన డ్రైవర్ల సంఘం

కడప కలెక్టరేట్, జనవరి2 (ఆంధ్రజ్యోతి): ఏపీ ఎన్జీవో రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన విద్యాసాగర్‌ను ఏపీ ప్రభుత్వ డ్రైవర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డి.కొండయ్య, కార్యవర్గ సభ్యులు విజయవాడలోని ఎన్జీవో హోంలో గురువారం కలిశారు. ఈ సందర్భంగా కొండయ్య మాట్లాడుతూ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలన్నారు. ముఖ్యమంత్రిని కలిసి రెండు డీఏలు,ఐఆర్ ప్రకటించేలా కృషి చేయాలని కోరారు.

అంతర్జాతీయ తెలుగు మహాసభలకు డాక్టర్ షేక్ ఇబ్రహీంకు ఆహ్వానం

వేంపల్లె, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో నిర్వహించే అంతర్జాతీయ తెలుగు మహాసభలకు వేంపల్లె వాసి బజాజ్ పక్షరూం అధినేత డాక్టర్ షేక్ ఇబ్రహీంకంకు ఆతిథ్యం రావడం జరిగింది. హైదరాబాద్, ఢిల్లీ, చెన్నై, బెంగుళూరు, విజయవాడ, విశాఖపట్టణం, సింగపూర్, మలేషియా, దుబాయ్ తదితర ఏశాల నుంచి ఎంతో మంది కవులు, రచయితలు, విమర్శకులు, సాహితీపరులు పాల్గొంటున్నారు. డాక్టర్ షేక్ ఇబ్రహీం రాసిన బతుకుప్రయాణం, బంౕదీకా జిందగీ, నేను మనిషిని, ఓ రైతన్న, హోర పాపామే, ఆమె మనిషే తదితర కవితలు రాశారన్నారు. ఈయన రాసిన వ్యాసాలు, జాతీయ, అంతర్జాతీయపరంగా ప్రచురితమయ్యాయి.

నిబంధనలు పాటించండి: ఆర్టీసీ ఈడీ

కడప మారుతీనగర్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాల బారిన పడకుండా ప్రతి వాహనదారుడు రహదారి నియమనిబంధనలు పాటించాలని ఆర్టీసీ రాయలసీమ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టరు పైడి చంద్రశేఖర్ సూచించారు. గురువారం స్థానిక ఆర్టీసీ ఈడీ కార్యాలయంలో కడప కేంద్రీయ విద్యాలయ స్కూలు చిల్డ్రన్స్ పేరెంట్స్ అసోసియేషన్ ప్రతినిధులైన జితేంద్ర, సి.విశ్వనాథ్‌ల సమక్షంలో ట్రాఫిక్ సూచనల పోస్టరును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనలపై తల్లిదండ్రులు పిల్లలకు అవగాహన కల్పించాలన్నారు.

ఆపస్ డైరీని ఆవిష్కరించిన ఎమ్మెల్సీ

కడప ఎడ్యుకేషన్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఆపస్) రూపొందించిన డైరీని గురువారం ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి ఆవిష్కరించారు. 2025 డైరీ, క్యాలెండర్‌ను పశ్చిమ రాయలసీమ నియోజకవర్గ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డి ఆపస్ ప్రతినిధులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ విద్యా సంవత్సర నాటికి ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలతో పాటు వారి సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం కృషిచేస్తోందన్నారు. అనంతరం ఆపస్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సి.చెన్నయ్య, డి.కొండారెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంలో ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం ఎల్లప్పుడు ముందుంటుందన్నారు. ఆపస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామాంజనేయప్రసాద్, రాష్ట్ర కార్యదర్శి సుబ్బరాయుడు, రాష్ట్ర కార్యవర్గ సభ్యు లు వెంకటరామిరెడ్డి, రాష్ట్ర సేవా ప్రముఖ్ ఎరుకలరెడ్డి, కోశాధికారి శ్రీనివాసులు, మీడియా ఇన్‌చార్జి బాలకృష్ణుడు, జిల్లా ఉపాధ్యక్షులు నాగరాజు, మల్లేశ్వరయ్య, చంద్రమోహన్, ప్రసాద్, హనుమతునాయక్, రాధాకృష్ణయ్య, పాల్గొన్నారు.



డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి, ఆపస్ ప్రతినిధులు

ఎస్టీయూ డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ

సింహాద్రిపురం, జనవరి 2(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రోపాధ్యాయ సంఘం 2025 డైరీ, క్యాలెండర్‌ను సింహాద్రిపురం ఎంఈఓ 1 ఓబులేసు, ఎంఈఓ2 శారద గురువారం ఆవిష్కరించారు. అనంతరం పులివెందుల టీడీపీ ఇన్‌చార్జ్ బీటెక్ రవి సతీమణి లతారెడ్డికి, మాజీ జెడ్పీటీసీ పోరెడ్డి ప్రభాకర్‌రెడ్డికి ఎస్టీయూ నాయకులు డైరీలు, క్యాలెండర్లను అందించారు. ఎస్టీయూ నాయకులు అంగడి నాగేంద్ర, పద్మనాభరెడ్డి, మహేంద్రనాథరెడ్డి, జనార్ధన్‌రెడ్డి, విజయవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.



ఎస్టీయూ డైరీ, క్యాలెండర్‌లను ఆవిష్కరిస్తున్న ఎంఈఓలు

కమలాపురం అభివృద్ధికి కేంద్రం కృషి అభినందనీయం

సికెదిన్నె, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): కమలాపురం నియోజకవర్గ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం కృషి చేయడం అభినందనీయమని కమలాపురం ఎమ్మెల్యే పుత్తా చైతన్యరెడ్డి అన్నారు. తన పర్యటనలో భాగంగా కేంద్ర మంత్రి జితేంద్రసింగ్ కమలాపురం అభివృద్ధికి అన్ని విధాలా సహాయం అందిస్తానన్నారు. రైతులకు సబ్సిడీలు అందించి పంట పెట్టుబడికి ఖర్చు తగ్గించడంతోపాటు గ్రామాల్లో రోడ్లు, మౌలిక సదుపాయాలు, అభివృద్ధికి సైతం కేంద్ర ప్రభుత్వం సహకరిస్తుందన్నారు. అనంతరం సజ్జల భూ ఆక్రమణపై విలేకరులు అడిగిన ప్రశ్నకు ఎమ్మెల్యే సమాధానమిస్తూ వైసీపీ వారు ఆక్రమించిన భూములను స్వాధీనం చేసు కుని ప్రభుత్వంవి అయితే ప్రభుత్వానికి, ప్రైవేటువి అయితే ప్రైవేటు వారికి అక్ర మిస్తామన్నారు. టీడీపీ నాయకులు టి.వి.కృష్ణారెడ్డి, గంధం మోహన్‌బాబు, వీరకుమార్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి, జన, జగన్, బ్రహ్మానందరెడ్డి,రామాంజనేయులరెడ్డి, జి.వి. సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సదస్సులలో భూ సమస్యలు పరిష్కరించుకోండి

చెన్నూరు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): రైతులు రెవెన్యూ సదస్సులలో అర్జీలు సమర్పించి భూ సమస్యలు పరిష్కరించకోవాలని తహసీల్దారు సరస్వతి అన్నారు. మండలంలోని ముం డ్లపల్లె గ్రామంలో గురువారం జకిగిన రెవెన్యూ సదస్సులో పలువరు రైతులు ఆన్‌లైన్ మ్యుటేషన్ తదితర సమస్యలపై అర్జీలు సమర్పించారు. వాటిని పరిశీలించిన తహసీల్దారు మాట్లాడుతూ ప్రతి గ్రామంలో రైతులకు సమస్యలు ఉన్నాయని, వాటిని పరిష్కరించుకోవాలన్నారు. సర్వేయరు సోవశేఖర్, డీటీ వెంకటరణ, ఆర్ఐ కౌశిక్, వీఆర్వో తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న తహసీల్దారు సరస్వతి

'నిరాహార దీక్షకు తరలిరండి'

వేంపల్లె, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ కార్మిక సంఘం మండలి బోర్డును పునఃప్రారంభించాలని కోరుతూ ఈనెల 6న కడప కలెక్టరేట్ వద్ద తలపెట్టిన నిరాహార దీక్షకు తరలిరావాలని వేంపల్లె భవన నిర్మాణ కార్మిక సంఘం నేతలు పిలుపునిచ్చారు. గురువారం స్థానిక నాలుగురోడ్ల కూడలిలో కరపత్రాలు విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షులు రామాంజనేయులు, జిల్లా ఉపాధ్యక్షులు చల్లా బాలాజీ, జిల్లా కోశాధికారి నాగేశ్వరరావు, వేంపల్లె అధ్యక్షులు దస్తగిరి, వల్లెపు బుజ్జి, బాబు, చలపతి, సుబ్బారావు, చిన్న, ఆంజనేయులు, టోపీవల్లి, రవి పాల్గొన్నారు.



10న తహసీల్దార్ కార్యాలయాల వద్ద ఆందోళన

కడప సెవెన్ రోడ్స్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): తహసీల్దార్ కార్యాలయాల వద్ద ఈనెల 10వ తేదీన ఆందోళన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర తెలిపారు. గురువారం ఆయన బాధితుల సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన పేదలకు పట్టణాల్లో రెండు సెంట్లు గ్రామాల్లో మూడు సెంట్లు ఇంటి స్థలం, ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు, రెండు ఎకరాల సాగుభూమి మంజూరు చేయాలనే డిమాండ్‌తో తలపెట్టిన రాష్ట్రవ్యాప్త ఆందోళనలో ఈనెల 10న మండల తహసీల్దార్ కార్యాలయాల వద్ద ఆందోళనకు సీపీఐ సిద్ధమైందన్నారు. అర్హులైన పేదలకు ఇంటి స్థలం, సాగుభూమి సాధనకై ఈనెల 10న జరిగే ఆందోళనలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు: ఏడీఏ

కడప రూరల్, జనవరి 2(ఆంధ్రజ్యోతి) : ఎరువలను డీలర్లు అధిక ధరలకు విక్రయిస్తే చట్టపరమైన చర్యలు కఠినంగా ఉంటాయని కమలాపురం వ్యవసాయ సహాయ సంచాలకులు(ఏడిఏ) ఎ.వి. నరసింహారెడ్డి పేర్కొన్నారు. గురువారం కడప నగరంలోని పలు ఎరువుల దుఖాణాలను ఏవో సురేష్‌కుమార్‌రెడ్డితో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎరువులను ఎమ్మార్పీ ధరలకు మాత్రమే విక్రయించాలన్నారు. స్టాక్ రిజిస్టర్లను, బిల్ బుక్‌లను నిబంధనల ప్రకారం మెయింటనెన్ చేయాలన్నారు. ఎరువుల విక్రయాలకు సంబంధించి అనుమతులు తప్పకుండా ఉండాలని సూచించారు. ఇందులో ఎటువంటి అవకతవకలు జరిగినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే నిషేధిత ఎరువుల విక్రయాలు చేయరాదని డీలర్లకు ఆదేశాలు జారీచేశారు.

పాఠశాలల అభివృద్ధికి ఎస్ఎంసీలే మూలం

చెన్నూరు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల అభివృద్ధికి పాఠశాల యాజమాన్య కమిటీలే మూలమని ఎంఈఓ-1 గంగిరెడ్డి, ఎంఈఓ-2 సునీత అన్నారు. గురువారం స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో పాఠశాల యాజమాన్య కమిటీలకు విద్యార్థుల సంఖ్యను ప్రభుత్వ పాఠశాల్లో ఎలా పెంచాలనే విషయమై ఒక్క రోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలలకు దీటుగా విద్యార్థుల సంఖ్యను పెంచాలన్నారు. 5 సంవత్సరాలు దాటిన బడి ఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలన్నారు. హెచ్ఎంలు, రత్నాదేవి, ఉమామహేశ్వరి, పద్మనాభయ్య, రిసోర్స్ పర్సన్స్ వెంకటసుబ్బయ్య, శ్రీనివాసులు, ఖాదర్‌బాష, ఎస్ఎంసీలు తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంఈఓ గంగిరెడ్డి







సమాజ నిర్మాతలు ఉపాధ్యాయులే

పోరుమామిళ్ల, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): సమాజ నిర్మాతలు ఉపాధ్యాయులేనని జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రామిరెడ్డి, డాక్టర్ కరిష్మా అన్నారు. ఎస్టీయూ క్యాలెండరు, డైరీని వారు ఆవిష్కరించారు.









'అమృత్' పైప్‌లైన్‌కు లీకులు

పొలాల్లోకి పారుతున్న మైలవరం నీరు ● పరిశీలించిన మున్సిపల్ కమిషనర్

ప్రొద్దుటూరు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): అమృత్ పథకం కింద మైలవరం రిజర్వాయర్ నుంచి ప్రొద్దుటూరుకు వచ్చే ప్రధాన పైపులైనుకు లీకులొచ్చాయి. కొంతకాలంగా మైలవరం నీరు పొలాల్లో పారుతోంది. రైతులు ఈ పైపు లైను లీకులపై పబ్లిక్ హెల్త్ అధికారుల దృష్టికి తెచ్చినా పట్టించుకోలేదు. ఇటీవల లీకు మరింత ఎక్కువవడంతో లీకును సరిచేయడానికి పదిరోజులు మైలవరం నుంచి నీటి పంపింగ్ నిలుపు తామని కమిషనర్ మల్లికార్జునకు పబ్లిక్ హెల్త్ ఏఈ వీర కుమార్ తెలిపారు. లీకును గుర్తించి సరిచేయడానికి సమయం పడుతుందని కమిషనర్‌కు తెలిపారు. పదిరోజులు నీటి సరఫరా నిలిపితే పట్టణ ప్రజలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతాయని రామేశ్వరం హెడ్ వాటర్‌వర్కులో మున్సిపల్ బోర్లు వర్కింగ్‌లో లేవని వాటిని రన్నింగ్‌లో పెట్టి పరిశీలించాక మైలవరం రిజర్వాయర్ నుంచి నీటి పంపింగ్ నిలుపుదల పరిశీలిస్తామన్నారు. కమిషనర్ గురువారం మున్సిపల్ ఇన్‌చార్జ్ ఈఈ దస్తగిరి, పబ్లిక్ హెల్త్ ఏఈ వీరా, మెగా ఇంజనీరింగ్ కంపెనీ ప్రతినిధులతో కలిసి జమ్మలమడుగు నియోజకవర్గం దానవుల పాడు వద్ద రోడ్డు పక్కన పొలాల్లో వెళుతున్న పైపులైను లీకును పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పంపింగ్ నిలుపుదల చేయకుండా ముందు ఎక్కడ లీకులు ఉన్నాయో గుర్తించాలన్నారు. ఈలోపు తాము మున్సిపల్ తాగునీటి బోర్లు సిద్ధం చేసుకుని వాటి ద్వారా నీటిని అన్ని ప్రాంతాలకు సరఫరా చేయగలమా లేదా అని సమీక్షించు కుంటామని తెలిపారు. పంపింగ్ నిలుపుదలపై ఆ తరువాత నిర్ణయం తీసుకుంటామన్నారు. అందులో సంక్రాంతి పండుగ దగ్గరలో వుందని బయటి ప్రాంతాల్లో వుండే వారు స్వగ్రామాలకు వస్తారని పట్టణ ప్రజలకు నీటి సరఫరాలో అవాంతరాలు లేకుండా చూసుకున్నాకే పంపింగ్ నిలిపి లీకులు పూడ్చివేసే పనులు శరవేగంగా పూర్తి చేయించాలన్నారు.



మైలవరం - ప్రొద్దుటూరు పైప్‌లైన్ లీకును పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున

గుంతలు పూడ్చిన పోలీసులు

కాశినాయన జనవరి2 (ఆంధ్రజ్యోతి): కొంత కాలంగా ఓబుళాపురం మూడురోడ్ల కూడలిలో ప్రధాన రహదారి పక్కన ఏర్పడిన గుంతలను ఎస్ఐ హనుమంతు బుధవారం తన సిబ్బందితో కలిసి మట్టి తోలించి ఎక్స్‌కవేటర్‌తో పూడ్చించారు. దీంతో పలువురు వాహన చోదకులు హర్షం వ్యక్తం చేశారు. ఓబుళాపురం మూడురోడ్ల కూడలిలో సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీ చేపట్టారు. 10 మందికి రూ.3050 రూపాయలు అపరాధ రుసుం వసూలు చేశారు.

బ్రహ్మంగారి సేవలో చిత్తూరు ఎమ్మెల్యే

బ్రహ్మంగారిమఠం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామిని గురువారం చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్, ఎమ్మెల్సీ దొరబాబు, చైర్మన్ కటారి హేమలత కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ ఫిట్‌పర్సన్ శంకరబాలాజీ, మేనేజరు ఈశ్వరయాచారి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి ప్రత్యేక పూజలు చేయించారు. మండల టీడీపీ అధ్యక్షుడు చెన్నుపల్లి సుబ్బారెడ్డి, సాంబశివారెడ్డి, లాయరు పట్టాభి, శ్రీను, పూజాశివయ్యయాదవ్, సురేంద్ర, రమేశ్ పాల్గొన్నారు.

కేంద్ర మంత్రిని కలిసిన బీజేపీ నేతలు

ముద్దనూరు జనవరి2(ఆంధ్రజ్యోతి): కేంద్ర మంత్రి జితేందర్ సింగ్‌ను గురువారం మండల బీజేపీ నేత మధుసూదనరెడ్డి, యువనేత గుణవంత్‌రెడ్డి కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఎర్రగుంట్ల నుంచి ముద్దనూరు మీదుగా జమ్మలమడుగు వెళుతుండగా నాలుగు రోడ్ల కూడలిలో మంత్రికి ఘనస్వాగతం పలికారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు రాజుల శివశంకర్‌రెడ్డి, సురేంద్రనాధరెడ్డి, శంకర్‌రెడ్డి, తులశయ్యలక్ష్మీనారాయణ, నేతలు కార్యకర్తలు పాల్గొన్నారు.

కమిటీ మరింత బాధ్యత తీసుకోవాలి

ఎర్రగుంట్ల, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): కొత్తగా ఎన్నికైన పాఠశాల యాజమాన్య కమిటీ సభ్యులు మరింత బాధ్యతగా వ్యవహరించాలని ఎంఈఓ2 రామాంజనేయరెడ్డి అన్నారు. గురువారం ఎర్రగుంట్ల బాలుర ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎంలకు, కమిటీలోని ఒకరికి శిక్షణ నిర్వహించారు. జిల్లాలో శిక్షణ పొందిన ఐదుగురు రిసోర్స్ పర్సన్‌తో వారికి శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంఈఓ శివప్రసాద్, హెచ్‌ఎంలు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సీసీరోడ్ల పనుల పరిశీలన

రాజుపాలెం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ఉపాధి కింద సీసీ రోడ్ల నిర్మాణం జరుగుతున్న గ్రామాల్లో గురువారం ఎంపీడీఓ రమణారెడ్డి, ఈఓపీఆర్‌డీ షాకీర్‌ఆలీఖాన్ పరిశీలించారు. కొట్టాల, ఉప్పలపాడు తదితర గ్రామాల్లో రోడ్డు పనుల నాణ్యత ప్రమాణాలను పరిశీలించారు. టీడీపీ నేతలు మానికింది ఖాదర్‌బాషా, కొట్టాల జగన్‌మోహ‌న్‌రెడ్డి, శివారెడ్డి, ఇంజనీరింగ్ అసిస్టెంటు నరేశ్ పాల్గొన్నారు.

సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి

ప్రొద్దుటూరు టౌన్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని నిర్మాణ కార్మిక సంఘం ఏరియా కార్యదర్శి యేసోబు కోరారు. 6వ తేదీ కలెక్టరేట్ వద్ద నిర్వహిస్తున్న నిరహార దీక్షను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. గురువారం కలెక్టరేట్ వద్ద జరిగే నిరాహార దీక్ష కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు.

టీడీపీ నేత వీరారెడ్డికి నివాళులు

బ్రహ్మంగారిమఠం, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): బొగ్గుల వారిపల్లె టీడీపీ నేత వీరారెడ్డి అనారోగ్యంతో గురువారం మరణించడంతో ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ బొగ్గుల వారిపల్లెకు వచ్చి వీరారెడ్డి పార్థివ దేహానికి నివాళుల ర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈయన వెంట వాటర్‌షెడ్డు చైర్మన్ రాజారెడ్డి, మండల టీడీపీ అధ్యక్షుడు చెన్నుపల్లి సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

పదోన్నతులపై వివక్ష తగదు

ప్రొద్దుటూరు టౌన్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): పోలీసు అధికారులకు పదోన్నతులు కల్పించడంలో ప్రభుత్వం వివక్ష చూపడం తగదని రాయలసీమ ప్రాంతవాసులకు పదోన్నతులు కల్పించాలని, ప్రజాసంఘాల నేతలు గురువారం డిప్యూటీ తహసీల్దారు సాయినాథరెడ్డికి వినతి పత్రం అందజేశారు. రాయలసీమ పరిరక్షణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎం.ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ ఆంధ్రా ప్రాంతంలో 2003 బ్యాచ్ ఎస్‌ఐలు నేడు డీఎస్పీ ప్రమోషన్ల లిస్టులో ఉన్నారన్నారు. రాయలసీమ ప్రాంతానికి చెందిన 1996, 1998బ్యాచ్ ఎస్‌ఐలు ఇప్పటికీ ప్రమోషన్లు పొందలేకపోవడం విచారకరమన్నారు. రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ పట్టణ కార్యదర్శి షరీఫ్, బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి రవికుమార్, ఎమ్మార్పీఎస్ జిల్లా మహిళా అధ్యక్షురాలు చెన్నమ్మ మాదిగ, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఉర్దూ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలి

ప్రొద్దుటూరు టౌన్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఉర్దూ డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయాలని మూమెంట్ ఫర్ పీస్ అండ్ జస్టిస్ నేతలు ఎమ్మెల్యే వరదరాజులరెడ్డికి వినతి పత్రం అందజేశారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ సలీం మాట్లాడుతూ ఉర్దూలో ఇంటర్ పూర్తయిన విద్యార్థులు డిగ్రీ చదివేందుకు అవకాశం ఇవ్వాలన్నారు. ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, కమలాపురం, మైదుకూరు ప్రాంతాల్లో ఉర్దూ విద్యార్థులు పెద్ద సంఖ్యలో ఉన్నారని, వారి భవిష్యత్తుపై ఆలోచించి డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలన్నారు.

పన్ను వసూళ్లపై ఆర్డీ సమీక్ష

● అప్రూవల్‌లేని లేఅవుట్లపై ఆరా

ఎర్రగుంట్ల, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): నగర పంచాయతీలో జరుగుతున్న అభివృద్ధిపై మున్సిపల్ శాఖ నాలుగు జిల్లాల ఆర్డీ విశ్వనాథ్ ఆకస్మిక తనిఖీ చేపట్టారు. వివిధ శాఖల్లో జరుగుతున్న సచివాలయాల ప్లానింగ్, అడ్మిన్, శానిటరీ, అమెనిటీస్‌తో సమీక్షించారు. ప్లానింగ్ సెక్షన్‌లో జరుగుతున్న అనేక విషయాలను అడిగి తెలుసుకున్నారు. అనధికారిక కట్టడాలు, అప్రూవల్‌లేని లేఅవుట్లు, ప్లాట్లు ఇతర విషయాలపై స్థానిక అధికారులను ప్రశ్నించారు. పన్ను బ్యాలెన్సులు, ఈ ఆఫీసు ద్వారా ఎన్ని వెళుతున్నాయని ప్రశ్నించారు. జరుగుతున్న అభివృద్ధి పనులు, వచ్చిన నిధులపై ఆరా తీశారు. కమిషనర్ పేర్లి శేషఫణి ఇతర అధికారులు పాల్గొన్నారు.

ప్రతి అర్జీదారుడికీ న్యాయం జరగాలి : ఆర్డీఓ

కాశినాయన జనవరి2 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సుకు వచ్చే ప్రతి అర్జీదారుడికీ న్యాయం జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని బద్వేలు ఆర్డీఓ చంద్రమోహన్ పేర్కొన్నారు. బుధవారం సిద్దాయపల్లెలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడుతూ జాయింట్ ఎల్‌పీఎంలతో ఉన్న భూములను ఫ్రీఆఫ్ కాస్ట్‌తో విభజించుకునే అవకాశం ప్రభుత్వం కల్పించిందన్నారు. ఈఅవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈవిషయంపై అధికారులకు పలు సూచనలు సలహాలు అందజేశారు. తహసీల్దారు వెంకటసుబ్బయ్య, డీటీ, ఆర్ఐ పాల్గొన్నారు.

మొక్కజొన్నలో సస్యరక్షణ చర్యలు చేపట్టండి

ముద్దనూరు జనవరి2(ఆంధ్రజ్యోతి): మొక్కజొన్న పంటపై పురుగు ఆశించిందని సస్య రక్షణ చర్యలు చేపట్టాలని ఏఓ వెంకటకృష్ణారెడ్డి రైతులకు సూచించారు. పొలం పిస్తోందిలో భాగంగా గురువారం శెట్టివారిపల్లెలో రైతులు సాగు చేసిన మొక్క జొన్న పంటను పరిశీలించారు. మొక్కజొన్నలో మొవ్వ పురుగు, కాండపు తొలుచు పురుగు ఉధృతంగా ఉందన్నారు. పురుగు నివారణకు లీటరు నీటిలో 5 ఎంఎల్ వేప నూనె కలిపి పిచికారీ చేయాలన్నారు. ఉద్యాన సహాయకురాలు, రైతులు పాల్గొన్నారు.

మహాసభలను జయప్రదం చేయాలి

ప్రొద్దుటూరు టౌన్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ఈనెల 21, 22న జరిగే ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా 4వ మహాసభలను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ కార్యాలయంలో కరపత్రాలను ఆవిష్కరించారు. రాష్ట్ర కార్యదర్శి సుబ్బరాయుడు, ఆటోవర్కర్స్ అండ్ డ్రైవర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు హరి మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు, మోటారు కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ, హెచ్ఎల్‌తో కూడిన సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని కోరారు. వాహనమిత్ర అమలు చేసి ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు టీడీపీ ప్రభుత్వం జీఓనెం.21, 31లను రద్దు చేయాలన్నారు. శ్రీనివాసులు, ఎల్లయ్య, నరసింహ, శంకర్‌రావు పాల్గొన్నారు.



